
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 2, మార్చి 2025



మరపగుంట్ల వద్ద జామాయిల్ చెట్లను నరికివేయగా మిగిలిన ఉన్న మొద్దులు (ఇన్‌సెట్‌లో) లారీకి లోడ్ చేసిన కర్ర

అగ్రిగోల్డ్ వనాల్లో.. దొంగలు పడ్డారు!

అగ్రిగోల్డ్ భూములు కొందరు అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారాయి. వీటిలో ఎక్కువగా జామాయిల్ తోటలు ఉన్నాయి. అగ్రిగోల్డ్ కంపెనీ దివాలా తీసిన నేపథ్యంలో ఖాతాదారులకు న్యాయం చేయాలన్న తలంపుతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆ భూములను సంరక్షించింది. జిల్లాలోని కనిగిరి నియోజకవర్గంలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లో అగ్రిగోల్డ్‌కు చెందిన 15వేల ఎకరాల భూములు ఉన్నాయి. వాటిలో జామాయిల్ సాగు చేశారు. అయితే గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. వాటిని సంరక్షించాల్సిన సీఐడీకి సిబ్బంది కరువయ్యారు. దీంతో 2019 నుంచి వైసీపీకి చెందిన నేతలు తెగబడి ఆ భూముల్లోని జామాయిల్ కర్రను నరికించి అమ్ముకొని కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం వారితో కొందరు కలిసి మిగతా తోటల్లోని కర్రను దొంగతనంగా కొట్టేస్తున్నారు.



కట్టకిందపల్లి వద్ద జామాయిల్ కర్రను నరుకుతున్న రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన కూలీలు

నాయకులకు ఆదాయ వనరుగా జామాయిల్ తోటలు

- పామూరు, వెలిగండ్ల, సీఎస్‌పురం ప్రాంతాల్లో అత్యధికం
- వాటిలోని కర్రను నరికివేస్తున్న అక్రమార్కులు
- గత ప్రభుత్వ హయాంలో జోరుగా విక్రయించిన వైసీపీ నేతలు
- గిరాకీ ఉండటంతో వాటిపైనే అందరి కన్ను

కనిగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి నియోజకవర్గంలో అక్రమార్కులు జామాయిల్ కర్రను ఆదాయవనరుగా మార్చుకుని రవాణా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. పామూరు మండలంలో అత్యధికంగా 12వేల ఎకరాల్లో అగ్రిగోల్డ్ భూముల్లో సామాజిక వనాల సాగు చేపట్టారు. మండలంలోని కంభాలదిన్నె, రేణిమడుగు, గుమ్మనంపాడు, పడమటకట్ట కిందపల్లి, దూబగుంట గ్రామాల్లో అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ సాగు చేపట్టారు. అత్యధికంగా పడమటకట్టకిందపల్లిలో ఐదువేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వెయ్యి ఎకరాల్లోని జామాయిల్ కర్రను వైసీపీ నేతలు నరికి సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం స్థానికంగా ఉన్న కొందరి నేతల కన్ను జామాయిల్ తోటలపై పడింది. పరాయి ప్రాంతాల్లో వ్యాపారాలు సాగించే ఒకరు గ్రామంలోనే తిష్టవేశాడు. ప్రత్యేకంగా రాయలసీమ ప్రాంతానికి చెందిన మనుషులను పురమాయించి మరీ జామాయిల్ కర్రను నరికించి రవాణా చేస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్నాడు. ఈవిషయంపై స్థానిక ఎమ్మెల్యే మందలించినట్లు సమాచారం.

రెండు వేల ఎకరాలలో నరికివేత

ఎమ్మెల్యే హెచ్చరించినా ఆ నాయకుడు వెనక్కి తగ్గలేదు. పామూరు మండలంతో పాటు, సీఎస్‌పురం మండలంలోని పెదరాజు పాలెం, చింతపూడి నాగులారంలో సుమారు రెండు వేల ఎకరాల్లో అగ్రిగోల్డ్ జామాయిల్ కర్రను సదరునేతే తనఅనుయాయులతో కలిసి నరికించి అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. అలాగే, పామూరు మండలంలోని ఇతర గ్రామాల్లోని భూముల్లోని జామాయిల్ తోటలను వైసీపీ నేతలు గతంలోనే నరికివేశారు. అరకొరగా ఉన్న వాటిని ప్రస్తుత కూటమి నేతలే అక్రమంగా నరికించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వెలిగండ్ల మండలంలోని మరపగుంట్ల, గుడిపాటిపల్లి, మొగళ్లూరు గ్రామాల్లోనూ వెయ్యి ఎకరాల

మిగతా 6వ పేజీలో

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపు
- వారం రోజులపాటు జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు
- ఒంగోలులో ర్యాలీ
- పాల్గొన్న అధికారులు, విద్యార్థినులు



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, అధికారులు, విద్యార్థినులు

6

నమస్కరించి... నగదు అందజేసి!

- జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ
- ఒకే రోజు 93.28శాతం మందికి లబ్ధి
- గార్లపేటలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- ఇతర చోట్ల ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు



గార్లపేటలో పింఛన్ అందజేత సందర్భంగా వృద్ధులకు నమస్కరిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం వరుసగా తొమ్మిదో నెల కూడా జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా సాగింది. మార్చి లబ్ధిని శనివారం ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించగా జిల్లాలో చాలా ప్రాంతాల్లో అంతకన్నా ముందుగానే ప్రారంభించారు. ఈ విడత లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి మర్యాదపూర్వకంగా నమస్కరించి నగదు అందజేయాలని ప్రభుత్వం ప్రత్యేకంగా పేర్కొనడంతో తదనుగుణంగా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు, సిబ్బంది వ్యవహరించారు. జిల్లాలో మొత్తం 2,83,854 మందికి రూ.123.63 కోట్ల మేర పింఛన్ మొత్తాలను అందజేయాల్సి ఉంది. ఉదయం 10 గంటలకే 75శాతం మందికి ఇచ్చారు. సాయంత్రం ఐదు గంటలకు 2,55,013(90శాతం) మందికి రూ.110.30 కోట్ల మేర అందజేశారు. రాత్రికి 2,64,772 (93.28శాతం) మందికి పూర్తి చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన నియోజకవర్గ పరిధిలోని మర్రిపూడి మండలం గార్లపేట పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. సుమారు రూ.76 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. ఒంగోలులో 49వ డివిజన్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా పింఛన్ లబ్ధిని అందజేయగా నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎం.నిడమలూరులో పొగాకు గ్రేడింగ్ చేస్తున్న లబ్ధిదారు వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి సుబ్బాయమ్మ

విజయనగరం ఎంపీ పంపిణీ

మాలకొండ దేవస్థానంలో పూజల కోసం వచ్చిన విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు

మిగతా 6వ పేజీలో

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 21,282 మంది హాజరు
- ఒక విద్యార్థి డీబార్



సమయం మించిపోతుండటంతో పరీక్షా కేంద్రంలోకి పరుగు తీస్తున్న విద్యార్థి

ఒంగోలు విద్య, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తొలిరోజు విద్యార్థులకు ద్వితీయ భాష పేపర్-1 జరిగింది. 21,282 మంది హాజరు కాగా 1,408 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ఇంటర్‌బోర్డు ముందుగానే ప్రకటించడంతో విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అధికారులు లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా

మిగతా 6వ పేజీలో



ఒంగోలులో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా



ఒంగోలులోని విజయ్‌నగర్ కాలనీ సమీపంలో కొండభూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

కొండను ఆక్రమించేశారు!

- ఐడీఎస్ఎంటీ పరిధిలో షెడ్లు, అక్రమ నిర్మాణాలు
- కార్పొరేషన్, రెవెన్యూ పట్టించుకోకుంటే అంతా హాంఫట్

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. ప్రభుత్వ, పోరంబోకు భూములతోపాటు కొండలు సైతం కబ్జాకు గురవుతున్నాయి. అధికారులు అడ్డుకున్నా ఆగకుండా నాలుగు రోజులుగా ఐడీఎస్ఎంటీ పరిధిలో జరుగుతున్న ఆక్రమణలతో కొండ సైతం కరిగిపోతోంది. వివరాల్లోకెళితే.. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి ఉత్తరం వైపు విజయనగర్ కాలనీ, ఐడీఎస్ఎంటీ స్థలాల్లో (సర్వే నెం.63/1 మామిడిపాలెం) ఆక్రమణలు ఊపందుకున్నాయి. ఆ ప్రాంతంలో ఇప్పటికే రెవెన్యూ ఉద్యోగులకు గతంలో పట్టాలు ఇవ్వగా, మరోవైపు కార్పొరేషన్‌కు చెందిన ఐడీఎస్ఎంటీ స్థలాలు వేలం ద్వారా అమ్మకాలు జరిపారు. కాగా గత కొన్నినెలలుగా ఆ ప్రాంతమంతా పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా ఉంది. దీంతో ఇప్పటికే కొందరు అక్కడక్కడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. కొన్నిరోజులుగా అక్కడ డీకే, రిజిస్ట్రేషన్ భూముల వ్యవహారంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో గత నెలలో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ 31వ డివిజన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు, పరిష్కార దిశగా పలు ఆదేశాలు ఇచ్చారు. అదే సమయంలో ఎక్కువమంది కొండ పోరంబోకు భూమిలో తమకు పట్టాలు ఇచ్చారని, ప్రస్తుతం అవి ఎక్కడ ఉన్నాయో

మిగతా 6వ పేజీలో

వెలిగొండను పూర్తి చేస్తాం

- ఆ ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు
- చెంబు నీళ్లు లేకుండానే గత ఎన్నికలకు ముందు ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను మోసగించిన జగన్
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ బాలవీరాంజనేయస్వామి ధ్వజం
- తాజా రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశామని వెల్లడి

7లో

వైసీపీని వీడి టీడీపీలోకి

ఇద్దరు ఎంపీపీలకు కండువాలు కప్పి ఆహ్వానించిన వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం/పుల్లలచెరువు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీపీలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. త్రిపురాంతకం మండల పరిషత్ అధ్యక్షురాలు గొట్టిముక్కల రిబ్కా వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఎర్రగొండపాలెంలోని పార్టీ కార్యాలయంలో రెబ్కాకు పసుపు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ విధానాలు నచ్చి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎరిక్షన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, ఏ.నాసరరెడ్డి, వి.అంజనేయులు, ఎం.అల్లూరిరెడ్డి, కె.కొండలు, జి.వెంకటనారాయణ, జి.సునీల్, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



త్రిపురాంతకం ఎంపీపీ రిబ్కాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు



మెడలో పార్టీ కండువా వేసి పుల్లలచెరువు ఎంపీపీ వెంకటయ్యను ఆహ్వానిస్తున్న టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు ఎంపీపీ వెంకటయ్య కూడా..

పుల్లలచెరువు ఎంపీపీ కందుల వెంకటయ్య టీడీపీలో చేరారు. శనివారం ఆపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి తాను చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు పయ్యావుల ప్రసాద్, శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్యాస్‌కు అదనంగా వసూలు చేస్తే చర్యలు

- నాలుగు ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

వివరాలు 6వ పేజీలో



కోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

కోర్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

● హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

సింగరాయకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు ఆదేశించారు. శనివారం సింగరాయకొండకు వచ్చిన ఆయన స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలించారు. నెలలోపు కోర్టు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ టి.రవి, జిల్లా కోర్టు ఏవో సుధాకర్, న్యాయవాదులు సన్నెబోయిన శ్రీనివాసులు, బక్కమంతుల వెంకటేశ్వర్లు ఉన్నారు.

అగ్రిగోల్డ్ వనాల్లో దొంగలు పడ్డారు!

(5వ పేజీ తరువాయి)

విస్తీర్ణంలో అగ్రిగోల్డ్ భూముల్లో సాగుకాగా, గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు కర్రను నరికేసి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లోని మిగిలిన జామాయిల్ కర్రను కూడా అక్రమార్కులు నరికించి లారీలతో రవాణా చేసి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. జామాయిల్ కర్ర అక్రమాలపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో అందరూ తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని సమాచారం.ఎన్నో ఔషధ గుణాలున్న జామాయిల్ కర్రకు విదేశీ, స్వదేశీ మార్కెట్‌లో ఎంతో గిరాకీ ఉంది. 23 టన్నులు (ఒక లారీ కర్ర) విలువ సుమారు రూ.ఆరు లక్షల వరకు ఉంటుందని సమాచారం. పడమట కట్టకిందపల్లి, సీఎస్‌పురం ప్రాంతాల నుంచి విరివిగా ప్రతిరోజూ పది లారీల వరకు జామాయిల్ అక్రమ రవాణా సాగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. భారీస్థాయిలో అక్రమ రవాణా సాగిస్తున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. గత పాలకుల బాటలోనే ప్రస్తుత నేతలు వెళ్తూ అక్రమాలను బయటకి రానివ్వకుండా అధికారులకు మామూళ్లు ముట్టజెప్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ జామాయిల్ కర్రను నరికి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత సీఐడీ విభాగం వీటిపై దృష్టి సారించి అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నమస్కరించి.. నగదు అందజేసి..

(5వపేజీ తరువాయి)

జిల్లాలోని పామూరు మండలం కోడిగుంపలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని పేర్నమిట్టలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. హనుమంతునిపాడు మండలం వీరభద్రాపురం, వెలిగండ్ల మండలం కట్టకిందపల్లి గ్రామాల్లో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పంపిణీ చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని 34, 35 వార్డుల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎర్రగొండపాలెం పట్టణంతోపాటు పెద్దారవీడు మండలంలో టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, దర్శి పట్టణంలో అక్కడి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే కీలకమైన జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించిన మండలాల్లో హాజరు కాగా ఆయా మండలాల్లో కీలకమైన ఎంపీడీవోలు, తహసీల్దార్లు తమపరిధిలోని గ్రామాల్లో పాల్గొన్నారు. పొగాకు గ్రేడింగ్ పనుల్లో ఉన్న పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పని ప్రదేశానికి వెళ్లి అందజేశారు. కొద్దిమందికి పింఛన్లు ఇంకా పంపిణీ చేయాల్సి ఉండగా వారికి సోమవారం అందజేయనున్నట్లు సమాచారం.

కొండను ఆక్రమించేశారు!

(5వపేజీ తరువాయి)

తెలియదని, వాటిని వెంటనే చూపాలని కోరారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. తక్షణమే ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు తొలగించి, భూమిని బాగుచేసి, చదును చేయాలన్నారు. అలాగే పట్టాలు ఎవరి పేరున ఉన్నాయో పరిశీలించి వాస్తవ పరిస్థితిపై నివేదికలు ఇవ్వాలన్నారు. ఆ తర్వాత ఇప్పటికే పట్టాలు ఉన్నవారు ఎవరు? లేనివారు ఎవరు గుర్తించి, ఇంకా స్థలం ఉన్నట్లయితే అర్హులకు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదే అదనుగా ఆక్రమణదారులు ఆగమేఘాలపై కొండను తవ్వేశారు. నాలుగు రోజులుగా రేకుల షెడ్డులు, ఇళ్లు కట్టేస్తున్నారు. ఆక్రమణలను రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు ఆపే ప్రయత్నం చేసినా కబ్జారాయులు వినిపించుకోకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు. రేయింబవళ్లు జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు సీరియస్‌గా దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా ఒక్కో ఇంటిలో నాలుగైదు పట్టాలు ఉన్నట్లుగా పలువురు వెల్లడిస్తున్నారు. దీంతో ఎప్పటి నుంచో అక్కడే నివాసం ఉంటున్నట్లుగా అధికారులను నమ్మించే ప్రయత్నానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. పట్టాలు కలిగిన వారికి, అలాగే ఆక్రమణదారులకు మధ్య ప్రతిరోజూ వాగ్వాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు ఆక్రమణలు అడ్డుకుని అధికారపూర్వకంగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించాల్సి ఉంది.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా
● వసతి గృహాల విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్

ఒంగోలునగరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఆమె శనివారం విన్నూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లాలోని వసతి గృహాల విద్యార్థులతో జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. భవిష్యత్ లక్ష్యాలను చేరుకునేందుకు పదో తరగతి పరీక్షలు పాస్‌పోర్ట్ లాంటివని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. పరీక్షలు సానుకూల వాతావరణంలో రాసేందుకు అవసరమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని జిల్లా యంత్రాంగం కల్పిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వసతి గృహ విద్యార్థులకు ఇప్పటికే ఆల్ ఇన్ వన్ మెటీరియల్ అందజేసి ట్యూటర్లను కూడా నియమించామని కలెక్టర్ తెలిపారు. వీటిని వినియోగించుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. చదువు పదో తరగతితో ఆపవద్దని, కనీసం డిగ్రీ వరకు చదువు కొనసాగించాలని సూచించారు. తమకు 18 ఏళ్ల వయస్సు నిండే వరకు పెళ్లి చేసుకోబోమంటూ ప్రతి ఆడపిల్లా నిర్ణయించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు మరింత శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. తమ సొంత బిడ్డలుగా భావించి విద్య, ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతి వసతిగృహంలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌పై ఆరా తీశారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, వసతి గృహాలను తాను తనిఖీ చేస్తానని వార్డెన్లకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖాధికారి అంజల, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వీడియో సమావేశం ద్వారా విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, సమాధానం చెబుతున్న వసతి గృహ విద్యార్థిని

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

(5వపేజీ తరువాయి)

ఉండేందుకు 144 సెక్షన్‌ను అమలు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు కేంద్రాల్లో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. కేంద్రాలకు విద్యార్థులు భారీగా రావడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు తమ ఇష్టదైవాల ఆలయాల్లో ఉదయాన్నే పూజలు చేశారు.

విద్యార్థికి సాయపడిన పోలీసులు

ఒక విద్యార్థి పరీక్షా కేంద్రానికి పోలీసులు సకాలంలో చేరేందుకు సహాయపడ్డారు. ఏకేవీకే కళాశాల పరీక్షా కేంద్రానికి ఓ విద్యార్థి వచ్చాడు. అయితే అక్కడ నోటీసు బోర్డులో తన హాల్‌టిక్కెట్ నంబరు వెతకగా కనిపించలేదు. హాల్‌టికెట్‌ను పరిశీలించగా పేర్నమిట్టలోని కళాశాల పరీక్షా కేంద్రం ఆయనకు కేటాయించి ఉంది. దీంతో ఆ విద్యార్థి ఆందోళనకు గురయ్యాడు. అప్పటికే సమయం సమీపించడంతో అక్కడ డ్యూటీలో ఉన్న కోటేశ్వరరావు అనే ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంటనే ఆ విద్యార్థినిని తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని సంబంధింత కేంద్రానికి తీసుకెళ్లారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఏకేవీకే జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఉన్నారు. కాగా ఆర్ఐవో సైమన్ విక్టర్ ఏడు పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ అధికారులు 44 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పేర్నమిట్ట శ్రీ సరస్వతి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని పట్టుకొని డీబార్ చేశారు.



పరీక్షా కేంద్రం మార్చడంతో విద్యార్థిని బైక్‌పై తీసుకువెళుతున్న కానిసేబుల్ కోటేశ్వరరావు

ఇంటర్ పరీక్షల కోలాహలం

● నగరంలో పెరిగిన రద్దీ
● పలు ప్రాంతాల్లో స్తంభించిన ట్రాఫిక్

ఒంగోలు క్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభం కావడంతో ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. పలు ప్రాంతాల్లో వాహన రాకపోకలు సైతం నిలిచిపోయాయి. పరీక్షల రాసేందుకు విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో రావడం, అదే సమయంలో వాటిని ఆయా పరీక్ష కేంద్రాల వద్ద నిలిపివేయడం వల్ల సమస్య తీవ్రత పెరిగింది. అంతేగాకుండా వారాంతం కావడం కూడ మరో కారణం. ఉదయం 8గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు చేర్చేందుకు బస్సులు రావడంతో ఒక్కసారి నగరంలో రద్దీ పెరిగింది. అదే సమయంలో అక్కడ నియంత్రణ లేకపోవడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు బాగా ఇబ్బందిపడ్డారు. అదే సమయంలో కార్యాలయాలకు, పనులకు వెళ్లేవారు కూడ రోడ్ల పైకి రావడం వాహన చోదన కష్టతరంగా మారింది. పరీక్షలు రాసిన తరువాత కూడా 12 గంటల నుంచి బస్సులు పరీక్ష కేంద్రాల వద్ద నిలిపి వేయడం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా మంగమూరురోడ్డు, లాయరుపేట, కోర్టు సెంటర్, అంజయ్యరోడ్డు ప్రాంతాల్లో రద్దీ పెరగడంతో వాహనచోదకులు ప్రత్యామ్నాయంగా గాంధీరోడ్డు వైపు వెళ్లారు. దీంతో అక్కడ మరింతగా ట్రాఫిక్ స్తంభించింది.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం

ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో విద్యార్థులు ప్రత్యేక బస్సులలో పరీక్ష కేంద్రాలకు వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద బస్సులు నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇకపై ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చేస్తాం.

- సీఐ పాండురంగారావు.

గ్యాస్‌కు అదనంగా వసూలు చేస్తే చర్యలు

నాలుగు ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే గ్యాస్‌కు రసీదు కంటే అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన పది మంది గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్‌కు సంబంధించిన నాలుగు గ్యాస్ ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీపై గ్యాస్ ఏజెన్సీ యజమానులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా 1,602 మంది వినియోగదారుల నుంచి అభిప్రాయం తీసుకున్నదన్నారు. అందులో 10 మంది గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ రసీదుకు మించి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. దీంతో ఆ బాయ్స్‌కు సంబంధించి ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. గ్యాస్ డెలివరీ సమయంలో తప్పనిసరిగా తూకం వేసి సిలిండర్‌ను వినియోగదారులకు ఇవ్వాలన్నారు. జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు తమ పరిధిలోని డెలివరీ బాయ్స్‌తో సమావేశాలు ఏర్పాటు చేసి అదనపు వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్‌వో పద్మశ్రీ, అధికారులు ఈశ్వరరావు, డి.అనిల్, మొహిసింగ్, ఐ.పుల్లయ్య, ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారులు భాస్కర్ లింగారావు, ఎం.మోహనరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

మహిళా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్ , మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో పలుశాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల పాటు వివిధ అంశాలపై అవగాహన, మహిళల హక్కులను తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, కిశోర బాలికలకు ఉన్న మెరుగైన అవకాశాలను తెలియజేయాలని, పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం చిన్నపాటి మెలకువలను తెలియజేసేలా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తమ కార్యాలయంలో ఒక గంట పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వివిధ రంగాలలో ఉత్తమ పనితీరు కనపర్చి సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన మహిళలను ఈనెల 8న జరిగే వేడుకల్లో సన్మానించాలని కలెక్టర్ నిర్ణయించారు. అలాంటి వారిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల ద్వారా మహిళలకు అందుతున్న సేవలను తెలియజేసేలా ప్రత్యేక స్టాల్స్‌ను కూడా ఆ రోజు ఏర్పాటుచేయాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో చిన్న ఓబులేషు, ఏఎస్పీలు నాగేశ్వరరావు, అశోక్‌బాబు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు హేనాసుజన్, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, లక్ష్మానాయక్, శ్రీహరి, చిరంజీవి, కిరణ్‌కుమార్, శ్రీమన్నారాయణ, దినేష్‌కుమార్, ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మహిళలందరూ ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నుంచి వారంరోజుల పాటు జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నెల్లూరు బస్టాండ్ మీదుగా రిమ్స్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారంరోజులపాటు మహిళల హక్కులు, సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగానే ఈ ర్యాలీని చేపట్టినట్లు చెప్పారు.

పెళ్లి చూసేందుకు వచ్చి గాయాలపాలు

● నడిచి వెళుతున్న వ్యక్తిని ఢీకొన్న బైక్

ఒంగోలు క్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): పెళ్లి చూసేందుకు వచ్చి తీవ్ర గాయాలపాలయ్యాడు ఓ వ్యక్తి. ఈ సంఘటన ఒంగోలులోని పాత బైపాస్ రోడ్డులోని ఐటీఏ కన్వెక్షన్ హాల్ ఎదురుగా శనివారం ఉదయం జరిగింది. టంగుటూరులోని అరుంధతినగర్‌కు చెందిన ఎస్.కోటేశ్వరరావు ఒంగోలులోని ఐటీఏ కళ్యాణమడపంలో జరిగే బంధువుల వివాహానికి హాజరయ్యాడు. ఆయన కళ్యాణమండపంలో నుంచి బయటకు వచ్చి రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతుండగా అతివేగంగా వెళుతున ఓ బైక్ కోటేశ్వరరావును వేగంగా ఢీకొంది. దీంతో ఆయన గాలిలోకి ఎగిరి కింద పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావును అక్కడ నుంచి రిమ్స్‌కు తరలించారు. ఆయన అపస్మారక స్థితిలో ఉన్నాడు. బాధితుడి కుమారుడు బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కలెక్టర్ బంగ్లాలో పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ బేబీరాణి

పశువులకు గాలికుంటు రాకుండా టీకాలు వేయించాలి

● డీఏహెచ్‌వో డాక్టర్ బేబీరాణి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు గాలికుంటు, బ్రుసెల్లోసిస్ రాకుండా తప్పక టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ అధికారి (డీఏహెచ్‌వో) డాక్టర్ బేబీరాణి కోరారు. శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఒంగోలులో ప్రారంభించారు. ముందుగా కలెక్టర్ బంగ్లాలో ఉన్న పశువుకు, అనంతరం జాయింట్ కలెక్టర్ బంగ్లాలో ఉన్న పశువులకు టీకాలను వేశారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంపద రక్షణ కోసం జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం ద్వారా గాలికుంటు, బ్రుసెల్లోసిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శనివారం నుంచి ఈనెల 30వతేదీ వరకు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఈ వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలన్నారు. నాలుగు నెలల వయస్సు దాటిన ప్రతి పశువుకు ఏడాదికి రెండు సార్లు టీకా వేయించాలని చెప్పారు. దీనివల్ల పాల ఉత్పత్తి పెరగడంతో పాటు వ్యాధి ప్రభావం తగ్గిపోతుందన్నారు. అందువల్ల జిల్లాలోని పశుపోషకులందరూ ఈ టీకాలను తమ పశువులకు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

● రూ.5.50 లక్షల సొత్తు రికవరీ

ఒంగోలు క్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఇంట్లో చోరీకి పాల్పడిన షేక్ ఖాజాను అరెస్టు చేసి అతని వద్ద రూ.5.50 లక్షల సొత్తును రికవరీ చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. స్థానిక దారావారితోటలో గల దర్గా సెంటర్‌లో నివాసం ఉంటున్న ఎస్‌కే.మస్తాన్‌బాబా తన కుటుంబసభ్యులతో గత నెల 23న ఇంటికి తాళాం వేసి చినగంజాం వెళ్లారు. 24రాత్రి ఇంటి తాళం పగులగొట్టి 9 సవర్ల బంగారం, రూ.20 వేల నగదు అపహరించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి శనివారం సాయత్రం 6.30లకు స్థానిక మామిడిపాలెం నుంచి భాగ్యనగర్ వెళుతున్న అనుమానితుడు ఖాజాను తమ సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడని సీఐ చెప్పారు. అతని వద్ద ఉన్న 9 సవర్లు బంగారం, నగదును రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించినందుకు ఎస్ఐ ఎంవీ.నాయక్, ఏఎస్ఐ కె.సురేష్, హెడ్‌కానిస్టేబుళ్ళు ఎం.సాయి, జి.విజయ్, కానిస్టేబుల్ ఎం.అనిల్ లను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందిచినట్లు ఆయన వెల్లడించారు.

వైసీపీ సమావేశంలో పాల్గొన్న టీచర్ సస్పెన్షన్

కొండపి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సమావేశంలో పాల్గొన్న ఓ ఉపాధ్యాయుడిపై వేటుపడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ డీఈవో శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. మండలంలోని పెదకండ్లగుంట గ్రామానికి చెందిన భువనగిరి వెంకటసుబ్బయ్య మండలంలోని పోలిరెడ్డిపాలెం ఎంపీపీఎస్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. గడచిన ఏడాది డిసెంబర్‌లో జరిగిన వైసీపీ సమావేశానికి ఆయన హాజరైనట్లు డీఈవోకు ఆధారాలతో సహా కొందరు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన డిప్యూటీ డీఈవోను విచారణకు ఆదేశించారు. విచారించిన అనంతరం డిప్యూటీ డీఈవో ఇచ్చిన నివేదిక మేరకు వెంకటసుబ్బయ్యను సస్పెండ్ చేశారు.



అరుణకాలనీలోని చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

సింగరాయకొండ అరుణ కాలనీలో చోరీ

● రూ.1.80 లక్షల నగదు అపహరణ

సింగరాయకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ అరుణ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దొంగలు రూ.1.80లక్షల నగదును అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. అరుణ కాలనీలో నివాసం ఉంటున్న మలినేని గీతాంజలి జాతీయ రహదారి వద్ద హోటల్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆమె ఇంటికి తాళం వేసి హోటల్ వద్దకు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ప్రధాన ద్వారం తాళం పగులకొట్టి ఉంది. లోపలికివెళ్లి చూడగా బెడ్‌రూంలోని బీరువా తెరిచి ఉంది. అందులో ఉంచిన రూ.1.80 లక్షలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందన్న నిర్ధారణకు వచ్చిన ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బి.మహేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూలగుంటపాడు తిరుపతమ్మగుడిలో..

మండలంలోని మూలగుంటపాడు శ్రీలక్ష్మీతిరుపతమ్మ గుడిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుడి తలుపు తాళం పగులకొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు అమ్మవారి మెడలోని రెండు మంగళ సూత్రాలు, చెవుల కమ్మలు, పాపట బిళ్ల మొత్తం సుమారు ఆరు సవర్ల ఆభరణాలను అపహరించుకెళ్లారు. శనివారం ఉదయం గుడి తలుపులు తెరిచి ఉండటాన్ని స్థానికులు గమనించి లోపలికి వెళ్లి చూడగా అమ్మవారి మెడలోని నగలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్థానికుడు సన్నెబోయిన మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

సింగరాయకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ఈ ఘటన సింగరాయకొండ, ఉలవపాడు రైల్వేస్టేషన్ల మధ్య శనివారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఒంగోలు జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుడి వయసు 45-50 సంవత్సరాల మధ్య ఉంటుందని వారు తెలిపారు. ఒంటిపై ఖాకీ రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంటు, పచ్చ, ఎరుపు, పసుపు గళ్ల కండువా ఉన్నాయని చెప్పారు. జీఆర్పీ ఎస్సై అరుణకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొప్పెరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల అన్ని రంగాలలో దూసుకుపోతోంది. ప్రత్యేక ప్రణాళికలతో, ఉత్తమ విద్యా బోధనతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రాష్ట్ర స్థాయిలో పలు విభాగాలలో ప్రతిభ కనబరుస్తోంది. నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు గత నాలుగేళ్లలో 37 మంది విద్యార్థులు ఎంపికవడం అందుకు నిదర్శనం. ఒకప్పుడు అరకొరగా నడిచే పాఠశాలకు ఇప్పుడు 11 గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారు. ఉత్తమ విద్యా బోధన అందుతుండటంతో తల్లిదండ్రులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపించకుండా ఉన్నత పాఠశాల వైపే మొగ్గు చూపుతున్నారు. మండల స్థాయిలో అత్యధికంగా 540 మంది విద్యార్థులు ఉన్నది ఒక్క కొప్పెరపాడు పాఠశాలలోనే కావడం గర్వకారణం.


కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కార్పొరేట్‌కు దీటుగా
కొప్పెరపాడు ఉన్నత పాఠశాల

- 11 గ్రామాల నుంచి విద్యార్థులు
- ఏడో తరగతి నుంచే ప్రత్యేక ప్రణాళికతో బోధన
- రాష్ట్ర ,జిల్లాస్థాయిల్లో పలువురు రాణింపు
- చదువులో వెనుకబడిన వారిని గుర్తించి తర్ఫీదు
- గ్రామస్థులు, దాతల సహకారంతో వసతులు
- సీసీ కెమెరాలతో నిత్యం పర్యవేక్షణ
- నైపుణ్యాన్ని వెలికితీసేలా
- సైన్స్ ప్రదర్శనలు
- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు
- 37 మంది ఎంపిక

బల్లికురవ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం వి. కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 1983లో ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి నుంచి అరకొర విద్యార్థులతో ఉన్న ఈ పాఠశాల ఇప్పుడు మండల స్థాయిలోనే 540 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలగా గుర్తింపు వచ్చింది. నాలుగేళ్ల నుంచి ఈ పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ పాఠశాలకు నలువైపులా ఉన్న కొత్తూరు, వెలమవారిపలెం, గొర్రెపాడు, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడు, సుజాతనగర్, భూషావారిపాలెంతో పాటు అద్దంకి మండలం గోవాడ, శ్రీనివాసనగర్, సాధునగర్ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. ఈపాఠశాలలో విద్యా బోధన బాగుండటం వలన సుదూర గ్రామాల నుంచి కూడా విద్యార్థులు వస్తున్నారు. 2021లో ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన పురంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక పర్యవేక్షణతో పాఠశాలకు మంచి గుర్తింపు వచ్చింది. నిరంతరం ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు చదువులో వెనుకబడి వారిని గుర్తించి తరగతులు నిర్వహిస్తున్నారు. మరో వైపు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. దాతల సహకారంతో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ క్లాసులను నిరంతరం నిర్వహిస్తూ వారిని పోటీ తత్వంతో ముందుకు సాగేలా చేస్తున్నారు. అలానే పాఠశాలలో దాతల సహకారంతో సీసీ కెమెరాల నిఘా నడుమ పర్యవేక్షణ చేపడుతున్నారు.


కంప్యూటర్ ల్యాబ్‌లో చదువులు కొనసాగిస్తున్న విద్యార్థులు

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలలో సత్తా చాటిన విద్యార్థులు

నాలుగేళ్లుగా కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు నేషనల్ మీన్ మెరిట్ పరీక్షలలో సత్తా చాటుతున్నారు. వరుసగా ఇప్పటి వరకు 37 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. జిల్లా స్థాయిలో ఒక్క ఈ పాఠశాలకే అత్యధికంగా ఎన్‌ఎంఎంఎస్ సీట్లు వచ్చాయి. 2022లో పది సీట్లు, 2023లో 6 సీట్లు, 2024లో 10 సీట్లు, 2025లో 11 సీట్లను విద్యార్థులు సాధించారు.

విద్యార్థులు సాధించిన బహుమతులు

కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ ప్రతిభను కనబరిచారు. 2024- 2025 సంవత్సరాలలో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ పోటీల్లో నాలుగు విభాగాలలో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచి ప్రథమ స్థానం సాధించారు. అలానే యలగాల సుబ్బారావు స్మారక ప్రతిభా ప్రోత్సాహక పరీక్షలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి వరుసగా రూ.20, వేలు, రూ.15 వేలు బహుమతులను పదోతరగతి విద్యార్థులు కంభాల సాయిచరన్‌తేజ, బత్తుల అభిరాంలు సాధించారు. విజయవాడలో 26 జిల్లాల స్థాయిలో జరిగిన కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో బత్తుల అభిరాం నిలిచి బహుమతిని సాధించారు. ఇటీవల ప్రకటించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలలో ఏకంగా 11 సీట్లను విద్యార్థులు సాధించారు. జిల్లా స్థాయిలో మెదటి మూడు ర్యాంకులను పొందారు.


పలు పోటీల్లో కొప్పెరపాడు విద్యార్థులు సాధించిన మెమెంటోలు



మెరిట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు అందుకుంటున్న కొప్పెరపాడు పాఠశాల విద్యార్థి

ప్రత్యేక ప్రణాళికతో బోధన



మా పాఠశాలలో ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల పట్టుదలతో చదువులో పాటు ఆటలు, సైన్స్ ప్రదర్శనలతో ఉత్తమ విద్య బోధన చేస్తున్నాం. మా పాఠశాలకు 11 గ్రామాల నుంచి విద్యార్థులు రావటం తమకు ఎంతో ఆనందంగా ఉంది. నాలుగేళ్ల నుంచి నేషనల్ మెరిట్ పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. పదో తరగతి పరీక్షలలో జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించే లక్ష్యంతో విద్యా బోధన చేస్తున్నాం.

- పురం శెట్టి శ్రీనివసారావు, ప్రధానోపాధ్యాయుడు, కొప్పెరపాడు

అవసరమైన వసతులు కల్పిస్తున్నాం



మాగ్రామంలోని ఉన్నత పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా పనిచేస్తుంది. అందుకే తాము పాఠశాలకు అవసరమైన వసతులు కల్పిస్తున్నాం. తాను రూ. 20 వేలు వెచ్చించి కుర్చీలు అందజేశాను. పాఠశాల విద్యార్థులకు విద్యా బోధన బాగా అందుతుంది. అందుకే తమ పిల్లలను పట్టణాలకు పంపించకుండా మా గ్రామంలోని పాఠశాలకే పంపిస్తున్నాం.

- యర్రా కోటేశ్వరరావు, కొప్పెరపాడు

చదువు చాలా బాగుంది



పాఠశాలలో విద్యా బోధన బాగా ఉంది. ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 7 వ తరగతి నుంచే మాకు ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేస్తున్నారు. నేను రాష్ట్ర స్థాయిలో కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ బాగుంది.

- బత్తుల అభిరాం, పదో తరగతి విద్యార్థి

రోజూ పాఠశాలలో ప్రత్యేక తరగతులు



రోజూ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయి. నిత్యం కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నారు. నేను ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంకు సాధించాను. మా పాఠశాలకు పరీక్షలలో అత్యధిక సీట్లు రావటం ఆనందంగా ఉంది.

- మాదాల హిమ స్రవంతి, పదో తరగతి విద్యార్థిని, కొప్పెరపాడు

వెలిగొండను పూర్తి చేస్తాం

- ఆ ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు
- రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి

మద్దిపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు వరప్రసాదిని అయిన వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి పశ్చిమప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. చెంబు నీళ్లు లేకుండానే గత ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మండలంలోని గార్లపేట ఎస్సీ కాలనీకి రూ.73 లక్షల నిధులతో నిర్మించిన రహదారిని ఆయన శనివారం ప్రారంభించారు అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పింపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెలిగొండపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదన్నారు. పార్టీ కండువా మారుస్తావా అని వైసీపీ అధినేత అన్నందుకే ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఉలికిపాటుకు గురవుతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వెలిగొండ ప్రాజెక్టు వద్దకు పాదయాత్ర చేస్తానని ఎమ్మెల్యే చంద్రశేఖర్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన ప్రాజెక్టు వద్దకు కాకుండా ప్రజా సమస్యలపై గళమెత్తేందుకు శాసనసభకు రావాలని కోరుతూ జగన్‌రెడ్డి ఇంటి వద్దకు పాదయాత్ర చేస్తే మంచిదని హితవు పలికారు. రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ మహిళలు మంత్రి స్వామిపై పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


గార్లపేటలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

కార్పొరేషన్‌లు బలోపేతం

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన కార్పొరేషన్లను బలోపేతం చేస్తామని మంత్రి స్వామి చెప్పారు. వాటి ద్వారా త్వరలో లబ్ధిదారులకు పెద్దఎత్తున రుణాలు మంజూరు చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీపీటీ బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నందున వాటి పరిష్కారం కోసం సోమవారం మద్దిపూడిలో ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం దామచర్ల ఆంజేయులు యానాది కాలనీని మంత్రి సందర్శించారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేదన్న నెపంతో గృహ కనెక్షన్లు తొలగిస్తున్నారని వాపోయారు. స్పందించిన మంత్రి.. గిరిజన గృహాలకు విద్యుత్ సౌకర్యం తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయించడంతోపాటు విద్యార్థులు 2కి.మీ దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు ఎలక్ట్రికల్ ఆటో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జ్వాలా నరసింహం, ఎంపీడీవో ఎన్.జగదీష్, టీడీపీ నాయకులు ఎర్రమోతు శ్రీనివాసులు, చేరెడ్డి నరసారెడ్డి, రేగుల వీరనారాయణ, తుళ్లూరి నరసింహారావు, దాసరి వెంకటేశ్వర్లు, గుండపనేని వెంకటేశ్వర్లు, దేవరపు కోటేశ్వరరావు, సారెడ్డి యోగిరెడ్డి, సర్పంచ్ ఆనాల వెంకట్రావు, గురిజాల రాజేష్, పోలయ్య, నరసింహారావు, ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

అత్తను హత్య చేసిన అల్లుడి అరెస్ట్

8 నెలల తర్వాత పట్టుకున్న పోలీసులు

మార్కాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్యచేసి బెయిల్‌పై విడుదలై ఆ తర్వాత అత్తను కూడా హతమార్చి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు మార్కాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు వివరాలు వెల్లడించారు. ఎర్రగొండపాలెం మండలం యల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేళ్ల శ్రీను మండలంలోని వేములకోటకు చెందిన కన్నెసాని సునీతను వివాహం చేసుకున్నాడు. అయితే ఆయన స్వగ్రామానికి భార్య కాపురానికి రావడంలేదని కోపం పెంచుకున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో 2023 మార్చి 14వ తేదీన శ్రీను రోకలిబండతో మోది భార్య సునీతను హత్య చేశాడు. ఈ కేసులో జైలుకు వెళ్లిన శ్రీను బెయిల్‌పై బయటకు వచ్చాడు. భార్యను కాపురానికి పంపకుండా చేసి కుటుంబంలో ఘర్షణ పెరగడానికి అత్త నారాయణమ్మే కారణమని కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2024 జూన్ 30వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో నారాయణమ్మను మొద్దుకత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపి పారిపోయాడు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ కేసును సవాలుగా తీసుకున్న మార్కాపురం పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలించారు. నిందితుడు శ్రీను చెన్నై, పూణే, షిరిడీ, నాసిక్, కాశీ, వేములవాడ, రామేశ్వరం, తిరుత్తి తదితర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు సాంకేతిక పరిజ్ఞానంతో కనుగొన్నారు. చివరికి శ్రీశైలం నుంచి త్రిపురాంతకానికి వెళుతున్నట్లుగా సమాచారం అందింది. దీంతో శనివారం దేవరాజుగట్టు సమీపంలో నిందితుడు శ్రీనును అరెస్ట్ చేశారు. ఈ కేసును 8 నెలలపాటు శ్రమంచి ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించినట్లు డీఎస్పీ నాగరాజు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు



సదస్సులో మాట్లాడుతున్న యామినిశర్మ

అన్ని వర్గాలకు ఉపయుక్తంగా కేంద్ర బడ్జెట్

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినిశర్మ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శనివారం ఒంగోలులోని క్విస్ కళాశాల సమావేశపు హాలులో విద్యావేత్తలు, పట్టణ ప్రముఖులతో జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా యామిని శర్మ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు చేయూతను ఇచ్చే విధంగా ఉందన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగకరంగా రూ.12 లక్షల ఆదాయ పన్ను కట్టాల్సిన అవసరం లేదన్నారు. బడ్జెట్‌లో అనేక రాయితీలను కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, ఎం.విజయలక్ష్మి, డి.శివాజీ, డి.శ్రీనివాస్, రాధాకృష్ణ, మోజీ, అనిల్, విజయారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నైట్ స్వీపింగ్ ప్రారంభం



రోడ్ల శుభ్రతా పనులు ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పారిశుధ్యం మెరుగు కోసం నగరంలో నైట్ స్వీపింగ్ ప్రారంభమైంది. గత వైసీపీ హయాంలో నైట్ స్వీపింగ్‌ని నిలిపివేయగా, నగర వీధులలో పారిశుధ్యం పగటి వేళకే పరిమితం అయింది. కాగా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈమేరకు నగరంలో 150మందిని నూతనంగా విధుల్లోకి తీసుకోగా, నగరంలోని ప్రధాన వీధులలో రాత్రి సమయంలో పారిశుధ్యం పనులు శనివారం నుంచి కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

ఘనంగా పచ్చవ జడ్పీహెచ్ఎస్ రజతోత్సవం



దీఈవో కిరణ్‌కుమార్‌తో పూర్వ విద్యార్థులు

జరుగుమల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పచ్చవ జడ్పీ స్కూల్ రజతోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. అందరూ కలిసి కోలాటం ప్రదర్శించారు. ఈసందర్భంగా ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్, ప్రముఖ వైద్యుడు కొమ్మి నరసింగరావు, గ్రామ సర్పంచ్ కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళితులకు చెందిన ప్రభుత్వ సీలింగ్, అసైన్డ్ భూములను రిజిస్టర్, సిబ్బంది అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి లక్షల రూపాయాల దండుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్‌మాదిగ కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వైపాలెం నియోజకవర్గ కేంద్రంలో నిత్యం భూసమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో త్యాగరాజు, విజయకుమార్, మందా సుధాకర్, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలి : సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు తక్కువగా నిధులు కేటాయించడంపై శనివారం స్థానిక సాగర్‌సెంటర్‌లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని తంబి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిధులు కేటాయించడంలో అన్యాయం చేసిందన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీకి, విమానాశ్రయానికి, పట్టణాభివృద్ధికి, హార్బర్‌కు నిధులు కేటాయించలేదని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆమేర నిధులు కేటాయించకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.రమేష్, బంకా సుబ్బారావు, ఎస్‌డీ.హుస్సేన్, హనుమంతరావు, మాలకొండయ్య, జి.ఆదిలక్ష్మి, కేఎఫ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమర వీరులకు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న శ్రేణులు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో చేసిన పోరాటంలో అశువులు బాసిన మాదిగ అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. మార్చి 1న మాదిగ అమర వీరుల దినోత్సవం పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చేశారన్నారు. ఈక్రమంలో కొంతమంది మాదిగ సోదరులు జాతి కోసం అశువులు బాశారని, వారి త్యాగ ఫలితం నేడు వర్గీకరణ ఫలాలు త్వరలోనే అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో తిరువీధి బాబుమాదిగ, ఐదుపోగుల అంకరాజు, నూరి రామారావు, రాయపాటి సుబ్బారావు, మెత్తాళ్ళ రవి, కంభంపాటి రాజబాబు, ఆంజనేయులు, రాజేష్, బుట్టి కార్తీక్ పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగుల ప్రైవేటీకరణ తగదు

చీమకుర్తి,మార్చి1(ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్ ఉద్యోగులు ,కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ శనివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పూసపాటి వెంకట్రావు మాట్లాడుతూ గతంలో జరిగిన సమ్మెకాల ఒప్పందాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, ఏడుకొండలు, కోటేశ్వరరావు, నాగయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో ఆసరా



ఒంగోలులో పింఛను అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా



పేర్నమిట్టలో పింఛను నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

● కలెక్టర్ తమీమ్‌అన్సారీయా

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను ఎంతో ఆసరాగా నిలుస్తోందని కలెక్టర్ తమీమ్ అన్సారీయా తెలిపారు. శనివారం ఒంగోలు నగరంలోని 49వ డివిజన్‌లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులకు ఫించన్ ఇంటి వద్దకే అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే భరోసా : బీఎన్

సంతనూతలపాడు: కూటమి ప్రభుత్వం అంటేనే పేద, మధ్యతరగతి ప్రజలకు భరోసా అని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పేర్నమిట్ట 42వ డివిజన్ శాంతినగర్‌లో ఆయన ఇంటింటికి వెళ్లి పింఛనుదారులకు పింఛను నగదును ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన దగ్గర నుంచి అభివృద్ధికి అడుగులు పడుతూనే ఉన్నాయని, ప్రతిపక్ష వైసీపీ ఏదోవంకతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు అష్టకష్టాలు పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పాల్గొన్నారు.

కోలాహలంగా పింఛన్ల పంపిణీ

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మండలంలో శనివారం కోలాహలంగా సాగింది. చదలవాడ, ఉప్పుగుండూరు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి బేబీరాణి, డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి హాజరై పలువురు లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శనివారం వెల్లంపల్లి బీసీకాలనీలో జరిగింది. ఎంపీడీవో శ్రీనివాస ప్రసాద్ ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, పాల్గొన్నారు. పెద్దకొత్తపల్లిలో పోతినేని శ్రీనివాసరావు, మద్దిపాడులో కడియాల రఘుబాబు పెన్షన్లను పంపిణీ చేశారు.

97శాతానికి పైగా..

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో 97శాతానికి పైగా శనివారం పింఛన్‌లు పంపిణీ చేశారు. ఉదయం 7 గంటల నుంచే గ్రామ సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు నగదును అందజేశారు. మండల ప్రత్యేకాధికారి డి.వరలక్ష్మి వైరెడ్డిపాలెం గ్రామంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

జరుగుమల్లిలో...

జరుగుమల్లి మండలంలో ఎంపీడీవో రమణమూర్తి పింఛన్‌ల పంపిణీని పర్యవేక్షించారు. అన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు.

నిబంధనల ప్రకారమే భవన నిర్మాణాలు జరగాలి

కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు ● నూతన బిల్డింగ్ రూల్స్‌పై ఇంజనీర్లకు, బిల్డర్లకు అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): పట్టణాల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న భవన నిర్మాణ అనుమతులను ప్రతి ఒక్కరూ పాటించాలని, నిబంధనలు అతిక్రమించిన కట్టడాలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. భవన నిర్మాణ రంగంలో ప్రభుత్వం విడుదల చేసిన నూతన జీవోలపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం జీవో నెం.3,4,20లను విడుదల చేసిందన్నారు. వాటి ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. లే అవుట్ రూల్స్, భవన నిర్మాణం, అలాగే ఇంజనీర్ల పరిధిలోని ప్లాన్ మంజూరు తదితర అంశాలపై అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సెట్‌బ్యాక్‌లు ఉండాలని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రోడ్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని వదిలేలా ప్లాన్ చేయాలని చెప్పారు. బిల్డర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగర అభివృద్ధి జరగాలంటే నిబంధనల మేరకు నిర్మాణాలు జరగాలన్నారు. నిబంధనలు అతిక్రమించి అనుతి లేకుండా కట్టడాలు జరిగే వాటిని తొలగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుధాకర్, టీపీఎస్ ప్రసాద్, సర్వేయర్ ఆవుల శ్రీనివాసరావు, ప్లానింగ్ సెక్రటరీలు, బిల్డర్లు, లైసెన్స్ ఇంజనీర్లు పాల్గొన్నారు.





కుంభ పూజా కార్యక్రమంలో స్వామివారి ఆశీర్వాదం స్వీకరిస్తున్న సత్య

కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

టంగుటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులోని అంగాళపరమేశ్వరి దేవస్థానంలో శనివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన కుంభ పూజలో మారిటైం బోర్డు చైర్మన్ సత్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల జిల్లా కమిటీ

ఒంగోలు క్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటీవ్ అధికారుల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఒంగోలులోని హైదరీక్లబ్‌లో సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా బి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. అయితే అన్ని పదవులకు ఎలాంటి పోటీ లేకుండా నామినేషన్లు రావడంతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. జిల్లా అధ్యక్షుడు ఆర్.నరహరి, ఉపాధ్యక్షుడు ఎం.వెకటరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి ఎస్.హర్షవర్ధనరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.విజయ్‌భాస్కర్, జాయిట్ కార్యదర్శి డి.శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి బి.శ్రీహరి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా బి.ఈశ్వరరావు ఎస్.రామారావు, మౌలాలి, వి.రఘుసత్యనారాయణ, లీనా, గోపాలకృష్ణలను ఎన్నుకున్నారు.

తల్లీకుమారుడికి గాయాలు

మద్దిపాడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడికి గాయాలైన ఘటన శనివారం సీతారాంపురం కొస్టాల్ వద్ద జరిగింది. అద్దంకికి చెందిన తాటి అజయ్‌కుమార్, తన తల్లి పుష్పావతితో కలిసి బైక్‌పై ఒంగోలు వచ్చి వెళ్తుండగా వెనక నుంచి మినీట్రక్ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇరువురికి గాయాలు కాగా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వాహన డ్రైవర్ కె.శ్రీహరిరావును మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేయడం సంతోషంగా ఉందని ఆ సామాజిక వర్గం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒంగోలులోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నాయీ బ్రాహ్మణులను పూర్తిగా విస్మరించారన్నారు. టీడీపీ హయాంలో నాయీబ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టడంతోపా టు 200 యూనిట్‌లు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. అలాగే ఆదరణ పథకం కింద వృత్తి పనిముట్లు అందించేందుకు రూ.1000 కోట్లు కేటాయించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ నిడమనూరి రమేష్, మాజీ డైరెక్టర్ పి.చినవెంకటేశ్వర్లు, రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు సుధాకర్, అన్నవరపు వెంకట్రావు, హనుమంతరావు, యలమంద తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

ఘనంగా టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

సంతనూతలపాడు, మార్చి1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. తొలుత విద్యార్థులు హైస్కూల్ ఆవరణలోని సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో హెచ్ఎం ప్రమోద, ఎంఈవో వెంకారెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణం తనిఖీ

మద్దిపాడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లిలోని మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ సీఐ సుకన్య శనివారం తనిఖీ చేశారు. దుకాణాల వద్ద మద్యం సేవించకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో మహిళా సహాయకేంద్రాలు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

● ఎస్ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రానున్న మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్ఐ వి.అజయ్‌బాబు మహిళా సహాయకేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎండ్లూరు డొంకవద్ద ఉన్న ట్రిపుల్ ఐటీ విద్యార్థినులు మహిళా సహాయక కేంద్రాన్ని సందర్శించగా ఎస్ఐ వారికి అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలు, ఇబ్బందులు వస్తే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీవెన్స్ సెల్ చైర్‌పర్సన్ ఎ.పావని, పీడీ లావణ్య పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళలు, బాలికలకు అందించే సేవలపై ఎస్ఐ ప్రేమ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. శనివారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను పదో తరగతి విద్యార్థినులు సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ వారికి ఈవ్ టీజింగ్, పోక్సో కేసులు, మొదలైన చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉమెన్ ఏఎస్ఐ ఎం.వెంకటలక్ష్మి, హెచ్‌జీ వెంకటపద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : మహిళాదినోత్సవం వారోత్సవాల్లో భాగంగా శనివారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఫిర్యాదుల స్వీకరణకు సహాయక కేంద్రం గురించి సిబ్బంది వివరించారు.

కరవది పీహెచ్‌సీలో ప్రసూతి సేవలు

ఒంగోలు(రూరల్), మార్చి1(ఆంధ్రజ్యోతి): కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రసూతి సేవలు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి సుందరప్రసాద్ తెలిపారు. శనివారం ఒంగోలు మండలం కరవది పీహెచ్‌సీలో కాన్పు జరిగిన అనంతరం తల్లీబిడ్డను డిచ్చార్జి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఫిబ్రవరి 27న గర్భవతి ఆసుపత్రిలో చేరగా అదేరోజు ప్రసవించారని, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. అందువల్ల సురక్షితమైన ప్రసూతి సేవను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాన్పు అయిన మహిళ బ్యాంక్ ఖాతాకు ప్రభుత్వం రూ.7వేలను జమ చేస్తుందన్నారు. అలాగే బాలింతకు ఎన్టీఆర్ బేబీకిట్‌ను అందించారు.

మూడు కుర్చీలు, నిచ్చెన బహూకరణ

కరవదికి చెందని పోలవరపు రాఘవరావు పీహెచ్‌సీకి రూ.8,500 విలువ చేసే మూడు కుర్చీలు, రూ.3,500 విలువ గల నిచ్చెనను శనివారం బహూకరించారు. రాఘవరావును వైద్యాధికారి సుందరప్రసాద్ అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఒంగోలు(రూరల్), మార్చి1(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రతగా ఉండేలా చూసుకోవాలని ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య కోరారు. శనివారం ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో ఇంటింటికి పరిశుభ్రత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని చెత్త, ఇతర వ్యర్థాలను చెత్తబండిలో వేర్వేరుగా వేయాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ కాలువల్లో చెత్తను వేయవద్దని చెప్పారు. దీనివల్ల పరిశుభ్రత లోపించి రోగాలు ప్రబలే అవకాశం ఉందని, దోమలు నివారణకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వరకుమార్, మసూద్ ఆలీ, మోటా శ్రీనివాసరావు, శ్రీనివాసయాదవ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సమానత్వం కోసం పోరాడాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.పద్మ పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ఈనెల 8న స్థానిక ఎన్‌జీవో భవన్‌లో జరిగే పీవోడబ్ల్యూ రాష్ట్ర విలీన సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి వి.మంజుల మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీహెచ్.పద్మ, అమ్మాజీ, సుజాత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంచాలి : డీఈవో

ఒంగోలు విద్య, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిలాషను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో కిరణ్‌కుమార్ కోరారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వికసిత భారత్ దిశగా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆవిష్కరణల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్, పాటలు, డిబేట్ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు, ఎంఈవో కిషోర్‌బాబు, సమగ్ర శిక్ష ఏఎంవో రమేష్, జిల్లా సైన్స్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నవోదయ వార్షికోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయ 36వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. మార్కెటింగ్‌శాఖ ఏడీ ఉపేంద్రకుమార్ విద్యార్థులకు విలువైన సందేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి, ఉప ప్రిన్సిపాల్ శివరాం పాల్గొన్నారు.

సౌత్ జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు పేస్ విద్యార్థులు

ఒంగోలు విద్య, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ అంతర్ యూనివర్శిటీ పోటీలకు ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఈ తృతీయ సంవత్సరం విద్యార్థి జి.దినేష్, సీఎస్‌ఈ విద్యార్థి వి.అజీజ్‌వలి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జేఎన్‌టీయూకే జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 2నుంచి 4వ తేదీ వరకు పెరియార్ యూనివర్శిటీలో జరగనున్న సౌత్ జోన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నారు. శనివారం యూనివర్శిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.శ్రీధర్, ప్రిన్సిపాల్ మూర్తి, డీన్ సీవీ.సుబ్బారావు, వీరాంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

క్విస్‌లో విద్యార్థినులకు పలు పోటీలు

ఒంగోలు విద్య, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళలు, విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. డ్యాన్స్ మ్యూజికల్ చైర్, ఖోఖో, ఉపన్యాసం, చదరంగం పోటీలు నిర్వహించగా జిల్లాలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థినులు, అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు యామిని శర్మ మహిళా సాధికారతపై ప్రసంగించారు. ఈసీఈ హెచ్‌వోడి హిమబిందు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో డీన్ నవనీత్ కృష్ణన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రపాడులో జూదరుల అరెస్ట్

చీమకుర్తి,మార్చి1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రపాడు గ్రామ పరిధిలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.26,250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

అవీ..ఇవీ

మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా అసువులు బాసిన మాదిగల అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు పందిటి కాశీరావు మాదిగ అన్నారు. స్థానిక గడియార స్తంభం వద్ద ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా అసువులు బాసిన మాదిగ అమరవీరులను స్మరిస్తూ శనివారం వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కాపురం ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ఎనిబెరా కిశోర్ మాదిగ, తర్లుపాడు అధ్యక్షుడు బాబు మాదిగ, మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు సంజీవయ్య, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు సరేష్, శ్యామ్, నగేశ్, గాలీబ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

● మండలంలోని తిప్పాయపాలెం వద్ద ఘటన

మార్కాపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి). గడ్డి మోపు తీసుకుని వెళుతుండగా కారు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తిప్పాయపాలెం వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పాయపాలెం గ్రామానికి చెందిన రైతు కుర్రి ఎర్రయ్య (52) తన పొలం నుంచి పశువుల మేత తీసుకుని గ్రామంలోని తన ఇంటికి వస్తున్నాడు. గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో ఎల్లయ్య తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయన అక్కడిక్కడే మృతిచెందారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకుని వివరాలు సేరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు. మృతుని కుమారుడు సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అంకమ్మరావు తెలిపారు.

రామకృష్ణ కుటుంబానికి చెక్కు అందజేత

పొదిలి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జగన్నాథం రామకృష్ణ కుటుంబానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.2 లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు సానికొమ్ము సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై మాట్లాడుతూ యూటీఎఫ్ సంక్షేమ నిధి ద్వారా ఆయా కుటుంబాలకు కొంతస్వాంతనగా ఉంటుందన్నారు. ఇది బాధిత కుటుంబానికి ఓదార్పు నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పెమ్మని బాల వెంకటేశ్వర్లు, బి.బుజ్జిబాబు, పి.వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, సీహెచ్. లింగయ్య, యుటిఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కరాటే గ్రేడింగ్ టెస్టు

గిద్దలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్ప్రింగ్‌బోర్డు స్కూలులో కరాటే విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో విజయం సాధించిన విద్యార్థులకు రూరల్ సీఐ జి.రామకోటయ్య, న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన బ్లాక్ బెల్టు 7 డాన్ ఎస్.మోహన్‌రావు బెల్టులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆత్మరక్షణ కోసం ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో సిద్దార్థ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నారాయణ, కమిటీ ప్రతినిధులు, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వేస్ట్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మార్కాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ వేస్ట్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షన్నర విలువైన సామగ్రి దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వేస్ట్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో షార్ట్ సర్క్యూట్‌తో శనివారం సాయంత్రం సమయంలో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు యజమానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు.

హెచ్‌ఎం సేవలు ఆదర్శనీయం

● ఎంఈవో మస్తాన్‌నాయక్

పెద్దదోర్నాల, మార్చి1 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించిన హెచ్‌ఎం నారాయణరెడ్డి సేవలు ఆదర్శనీయమని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎస్‌వీ నారాయణరెడ్డిని ఉపాధ్యాయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు ఆయన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

యూత్ అధ్యక్షులుగా మాధవ్

గిద్దలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం గిద్దలూరు నియోజకవర్గ యూత్ అధ్యక్షులుగా రాచర్లకు చెందిన పి.మాధవ్ నియమితులయ్యారు. ఆమేరకు ఈసంఘం రాష్ట్ర ప్రతినిధులు కె.శ్రీనివాసులు, ఓ.వెంకటయ్యలు పేర్కొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



సభ్యత్వ నమోదు కార్డును అందజేస్తున్న నాయకులు

పెద్దదోర్నాల, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రకోట క్లస్టరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను క్లస్టర్ ఇన్‌చార్జ్ బట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, ఈదర మల్లయ్యలు శనివారం కార్యకర్తలకు అందజేశారు.

రంజాన్ క్యాలెండర్ల ఆవిష్కరణ

గిద్దలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జామియా మసీదు ఆవరణలో 2025 రంజాన్ నెల క్యాలెండర్‌ను ఇమామ్‌ల సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు పరమపవిత్రంగా ఈ పండుగను చేసుకుంటారని పేర్కొన్నారు. నెల రోజులపాటు ఖురాన్‌ను పఠించి తెల్లవారుజాము కంటే ముందే అన్నపానియాలు స్వీకరించి సూర్యాస్తమయం వరకు మంచినీళ్లు కూడా తీసుకోకుండా ఉపవాస దీక్ష చేస్తారని ఇమామ్‌ల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

● కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు ● పలుచోట్ల స్క్వాడ్ అధికారుల తనిఖీ



మార్కాపురంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం మార్కాపురం పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఆలయాల్లో పూజలు చేసి పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పట్టణంలోని శ్రీసాధన, శ్రీరెడ్డి మహిళా కళాశాల, గౌతమి, కమలా, జూనియర్ కళాశాలలు, రాయవరం సాంఘిక గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న విద్యార్థులు

కొమరోలు: ఇంటర్‌మీడియట్ 2024-25 విద్యా సంవత్సరానికి శనివారం నుంచి జరుగుతున్న పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు గిద్దలూరు సీఐ జే.రామకోటయ్య తెలిపారు. కొమరోలు పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులకు, పోలీసు సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా సీఐ రామకోటయ్య మాట్లాడుతూ విద్యార్థులను ప్రశాంతంగా పరీక్షలు రాసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. పట్టణంలో వివిధ శుభకార్యాల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు, వృద్ధులు హృద్రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వాటిని సప్లై చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పెద్దదోర్నాల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళా శాలలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణలో భాగంగా తెలుగు, సంస్కృతం, ఒకేషనల్ పరీక్ష రాసేందుకు మొత్తం 391 మంది విద్యార్థులకు గానూ 353 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మహాలక్ష్మమ్మ తెలిపారు. ఎం శ్రీనివాసులు డిపార్టుమెంటు అధికారిగా వ్యవహరించారు.

111 మంది గైర్హాజరు

గిద్దలూరు : ఇంటర్మీడియట్ పరీక్షలు గిద్దలూరులో ప్రశాంతం గా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 111 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. శనివారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్‌తోపాటు ఒకేషనల్ జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని జీవనజ్యోతి, వివేకానంద, సాహితి జూని యర్ కళాశాలల్లోని మూడు పరీక్ష కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. 903 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 111 మంది గైర్హాజరు కావడంతో 792 మంది పరీక్షలు రాసినట్లు ఆయా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు తెలిపారు. ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు సత్య రామిరెడ్డి, అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హామీ

మార్కాపురంరూరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక సర్వజన వైద్యశాలలోని వివిధ విభాగాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యశాలలోని వార్డులలో, వివిధ విభాగాలలో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. గత వారంలో తాను వైద్యశాలలో పరిస్థితులను పరిశీలించినప్పుడు ఐసీయూ, థైరాయిడ్ పరీక్షకేంద్రం గదులలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై వైద్యులతో చర్చించినట్లు తెలిపారు. త్వరలో రోగులకు ఆధునాతన వైద్య పరికరాలతో నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులుమాలపాటి వెంకటరెడ్డి, డాక్టర్ మౌలాలి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశాలలో వార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రతి ఆడబిడ్డ జీవితంలో ఉన్నతంగా రాణించాలి



మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు, ఐసీడీఎస్ అధికారులు

మార్కాపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి). ప్రతి ఆడబిడ్డ బాగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని తహసీల్దార్ చిరంజీవి అకాంక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మహిళా దినోత్సవ సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంత బాలబాలికలు బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆడపిల్లలు అన్నిరంగాలలో పురుషులతో సమానంగా పోటీపడాలన్నారు. సీడీపీవో సుశీలదేవి మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుండి 8వ తేదీ అంతర్జాతీయ మహిళాదినోత్సవం రోజు వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు శనివారం నుంచి వేడుకల్లో భాగంగా సైకిల్‌ర్యాలీ చేశారు. ఆడబిడ్డ పేరుతో మొక్కనాటే కార్యక్రమంతో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కంభం : అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా కంభం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అమూల్య మాట్లాడుతూ సమాజంలో అమ్మాయిలు అన్ని రంగాలలో రాణిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని కోరారు. ప్రధాని మోదీ మార్చి 1 నుండి 8వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళాదినోత్స వారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే శనివారం బేటీ బచావో - బేటీ పడావో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ర్యాలీలో సీడీపీవో నీలోఫర్, సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, అంగన్‌వాడి కార్యకర్తలు శ్రీదేవి, ఫాతిమా, నాగమణి, లక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



పింఛన్‌సొమ్ము అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను నేరుగా ఇంటివద్దే అందజేస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. శనివారం స్థానికంగా పలువీధుల్లో నివాసం ఉంటున్న పింఛన్‌దారుల నివాసం వద్దకు చేరుకొని ఆయన నేరుగా పింఛన్లను పంపిణీ చేశారు. ఉదయం 7 గంటల నుండి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, నాయకులు వేగినాటి శ్రీను, కంచర్ల సత్యనారాయణ గౌడ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి (మ్యాక్స్), పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

కంభం : కంభం మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం సాయంత్రం 5 గంటల వరకు 90 శాతానికి పైగా పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. మండలంలో మొత్తం 5953 ఫించన్లు ఉండగా శనివారం సాయంత్రానికి 5475 ఫించన్లు పంపిణీ చేశారని, మిగిలిన 478 మంది అందుబాటులో లేరని, ఆది, సోమవారాలలో ఫించన్లు అందజేస్తామన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని పెన్షన్ లబ్ధిదారులకు ఇళ్ల వద్దే నగదు పంపిణీ కార్యక్రమం అధికారులతో కలిసి నిర్వహించి నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో భర్త మరణించిన వెంటనే భార్యకు ప్రభుత్వం మంజూరుచేసిన లబ్ధిదారునికి పెన్షన్ నగదు ను శనివారం ఉదయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీన పింఛన్ల పండగను తెస్తోందన్నారు. మండలంలోని దరిమడుగు, బోడపాడు గ్రామాలలో డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం పిచ్చయ్య పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందన్నారు.

అన్ని వర్గాలకు ఉపయుక్తంగా కేంద్ర బడ్జెట్

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినిశర్మ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నివర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినిశర్మ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మ లా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శని వారం ఒంగోలులోని క్విస్ కళాశాల సమావేశపు హాలులో విద్యావేత్తలు, పట్టణ ప్రముఖులతో జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా యామినిశర్మ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు చేయూతను ఇచ్చేవిధంగా ఉందన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగకరంగా రూ.12 లక్షల ఆదాయ ప న్ను కట్టాల్సిన అవసరం లేదన్నారు. బడ్జెట్‌లో అనేక రాయితీలను కల్పిం చారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, ఎం.విజయలక్ష్మి, డి.శివాజీ, డి.శ్రీనివాస్, రాధాకృష్ణ, మోజి, అనిల్, వి జయారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యామినిశర్మ

మహాశివునికి రావణబ్రహ్మ వాహనసేవ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంట చింతల వరుణ్‌తేజశర్మలు మార్కాండేశ్వరస్వామి, జగదాంబలకు శనివారం అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం రావణాసుర వాహనంపై నటరాజ శివతాండవం అలంకారంలో స్వామికి నగరోత్సవం నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పోటెత్తిన భక్తులు

గిద్దలూరు : రాచర్ల మండలం జేపీ.చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. కేవలం శని వారాలలో మాత్రమే ఆలయం తెరచి ప్రత్యేక పూజలు నిర్వహి స్తారు. స్థానికంగానే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి రంగనాయక స్వామిని పెద్దఎత్తున దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణా, దికారి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్, : పట్టణంలోని జవహర్ నగర్‌లోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ని కలిసి ఆహ్వానపత్రం అందజేసింది. 3న ధ్వజారోహణం, లక్ష్మీపద్మా వతి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి కళ్యాణం, 4న శ్రీదేవి భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణం, 5న సీతా రామ కళ్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, 6న రుక్మిణి సత్యభామ శ్రీకృష్ణ కల్యాణం, 7న లక్ష్మీ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఏరువ సత్యనారాయణరెడ్డి, ముత్యాల మల్లారెడ్డి, సింగారెడ్డి యోగిరెడ్డిలు తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నాయకులు డా. డీవీ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.



రావణబ్రహ్మ వాహనంపై మహాశివుడు

మధ్యాహ్న భోజనం మెనూ అమలు చేయాలి

కంభం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నూతన మెనూ శనివారం నుంచి అనుసరించాలని ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. శనివారం అర్బన్‌కాలనీలోని ఉర్దూ స్కూలులో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల రికార్డులు, ఆర్వో ప్లాంటు పనితీరును, భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ మురళిమోహన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ రేటుకే కందుల కొనుగోలు

తర్లుపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో రైతుసేవా కేంద్రంలో త్వరలో మార్కెట్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేయనున్నట్లు ఏవో టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం క్వింటా కందుల రూ.7,550కి కొనుగోలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యాపారులు రైతులకు మాయమాటలు చెప్పి రూ.6,800కు మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. రైతులు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని, రైతుసేవా కేంద్రం ద్వారా అమ్ముకోవటం ద్వారా వెంటనే నగదు రైతు అకౌంట్‌లలో జమచేయబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతి రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి

● ఏవో జవహర్‌లాల్ నాయక్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

పెద్దదోర్నాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని ఏవో జవహర్‌లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని హసనాబాద్ గ్రామంలో విశిష్ట సంఖ్య నమోదుపై శనివారం ఏవో అవగాహన కల్పించారు. ఆ సంఖ్య నమోదుతోనే ప్రభుత్వ పథకాలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, వీపీఏ శివ నాయక్ పాల్గొన్నారు.

6నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు

కొమరోలు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కల్యాణరామ పట్టాభిరామస్వామి ఆలయ జీర్ణోధరణ, ధ్వజ, శిఖరకలశ, విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యాక్రమాలను ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బద్వేలుకు చెందిన బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ, ఆ బృందం ఈ క్రతువు నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 8న ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను సీనియర్ విభాగంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్లజతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గొవ, ఐదవ, ఆరవ, ఏడవ బహుమతులు వరసగా, రూ.లక్ష, రూ.80వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.25 వేలు, రూ.20, రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో యాంకర్ నారాయణస్వామి పాల్గొనున్నారు. పూర్తి వివరాలకు 9573319779, 9848998967 నంబర్లను సంప్రదించాలన్నారు.

పశ్చిమ ప్రకాశానికి ప్రభుత్వం మొండిచేయి



బడ్జెట్ ప్రతులను తగలబెడుతున్న సీపీఎం నాయకులు

మార్కాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో తగినన్ని కేటాయింపులు చేయకుండా పశ్చిమ ప్రకాశానికి మొండి చేయి చూపిందని వామపక్ష నాయకులు విమర్శించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక కోర్టు కూడలిలో సీపీఐ, సీపీఎం నాయకులు వార్షిక బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులకు నిరసనగా బడ్జెట్ ప్రతులను తగులబెట్టారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో వెలిగొండకు కేవలం రూ.359 కోట్లు కేటాయించి పశ్చిమ ప్రాంత ప్రజలను మోసగించిందన్నారు. ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని వామపక్షాలు, ప్రజాసంఘాలు పోరాటం చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఇదే విధంగా కొనసాగితే ఈ ప్రభుత్వ హయంలో కూడా ప్రాజెక్టు పూర్తికావడం కష్టమే అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కే కాశీం, మాజీ కౌన్సిలర్ చిత్తారి పెద్దన్న, అల్లూరయ్య, సీపీఎం నాయకులు డి.సోమయ్య, డీకేఎం రఫి, మాజీ కౌన్సిలర్ జవ్వాజి రాజు, గుమ్మా బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

గిద్దలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు కమిషనర్ ఐ.శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. శివారు కాలనీల్లో రోడ్లు, మురుగుకాలవలు లేక చిన్నపాటి వర్షం వచ్చినా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరారు. పట్టణ ప్రజల కోసం ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్న పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. కాశిరెడ్డికుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి వ్యాయామాలు చేసేందుకు పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో కొన్ని పరికరాలు ఏర్పాటు చేసినా వాటిని మొదలు పెట్టకపోవడంతో తుప్పుపట్టి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందచేసిన వారిలో సీపీఎం నాయకులు టి.ఆవులయ్య, నరసింహులు, థామస్, శ్రీనివాసులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

సంతనూతలపాడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని ఎంపీడీవో డి.సురేష్‌కుమార్ కోరారు. సంతనూతలపాడులోని చెత్తసంపదకేంద్రం వద్ద శనివారం ఆయన 30 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఈవో ఆర్డీ రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. కాగా మండలంలోని పింఛను లబ్ధిదా రులకు శనివారం సాయంత్రానికి రూ.2,87,31,500లను సచివాలయం, ఇతర శాఖ ల సిబ్బంది ద్వారా నగదును అందజేసినట్లు ఎంపీడీవో సురేష్‌కుమార్ తెలిపారు.

ముఖాముఖి

ప్రతిరైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

మహమ్మద్ ఫరూక్, ఏవో, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో ఎంత మంది రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకున్నారు?

జవాబు: మండలంలో 9,037 మంది విశిష్ట సంఖ్య నమోదు చేయించుకున్నారు. పీఎం కిసాన్ కింద 9,545 మందికిగాను రూ.1.95 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయి.

ప్ర: మండలంలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారా?

జ: మండలంలో పసుపుగల్లు, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశాం. క్వింటా మద్దతు ధర రూ.7,550 నిర్ణయించాం. తేమ శాతం 12 శాతం లోపు మాత్రమే ఉంచాలి.

ప్ర: ఈ పంట నమోదు ఎంతమంది రైతులకు చేశారు?

జ: మార్చి 3వ తేదీలోగా రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలి. ఇప్పటివరకు 2,103 మంది రైతులకు 5,420 ఎకరాలు పంట నమోదు చేశాం.

ప్ర: రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేశారా?

జ: ఈ ఏడాది రైతులకు యంత్ర పరికరాలు అందజేసేందుకు గైడ్‌లైన్స్ వచ్చాయి. పంట నమోదు చేయించుకున్న రైతులకే సబ్సిడీపై యంత్ర పరికరాలు మంజూరవుతాయి.

ప్ర: రైతులకు ఎలాంటి సూచనలు, సలహాలు అందజేస్తున్నారు?

జ: మండలంలో పంటలు సాగు చేసిన రైతులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత ప్రతి మంగళ, బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో రైతులకు సూచనలు, సలహాలను అందజేస్తున్నాం.

విద్యతోపాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

పీసీపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని మండల విద్యాశాఖాధికారులు ఆర్.శ్రీనివాసులు, జి.సంజీవి అన్నారు. అప్పుడే ప్రతి విద్యార్థి రాణిస్తారని చెప్పారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సభ ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంఈవోలు మాట్లాడుతూ బాల్యం ప్రతిఒక్కరి జీవితంలో ఎంతో మధురమైనదని అన్నారు. ఆ మధుర జ్ఞాపకాలను ఈ పాఠశాల మీకందించిందన్నారు. కార్యక్రమంలో ఎన్ని కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పీసీపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలు, అభిమానులకు ఆపార్టీ నాయకులు శనివారం సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ఏదైనా ప్రమాదం జరిగితే బీమా వర్తిస్తుందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేసిందని గుర్తుచేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముండ్లమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన నాగులూరి తిరుపతమ్మ(20) ఈనెల 24వ తేదీ పురుగుమందు తాగటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. తొలుత కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున తిరుపతమ్మ మరణించింది. ఆమెకు భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిమ్స్ ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు స్థానిక హెడ్ కానిస్టేబుల్ అంకారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండకు అన్యాయం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజలకు ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సీఎస్‌పురం బస్టాండ్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.తిరుపతిరెడ్డి, గుర్రం లక్ష్మయ్య, జేసురత్నం, పపి తిరుపతయ్య, ఎస్.సుబ్బయ్య పాల్గొన్నారు. అలాగే, వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక కెనరా బ్యాంకు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల కార్యదర్శి షేక్ పెదమస్తాన్, సవరం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే 'సంక్షేమం'

» ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

పామూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత టీడీపీకే దక్కుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం దైవదర్శనం కోసం మాలకొండ దేవస్థానానికి ఆయన వచ్చారు. ఈసందర్భంగా మండలంలోని కోడిగుంపలకు చెందిన టీడీపీ నేత కొప్పల్లి సురేష్ గ్రామానికి ఆహ్వానించారు. గ్రామంలో జరుగుతున్న ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్నివర్గాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, రాయవరపు శ్రీకాంత్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పునుగుబాటి మాల్యాద్రి, కార్యదర్శి కొప్పల్లి నాగేశ్వరరావు, తదితరులు ఎంపీ అప్పలనాయుడును సన్మానించారు.

అలాగే, పామూరు కూడలిలో కాపు జేఏసీ తరుపున ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ సంఘం నాయకులతో కలిసి ఎంపీ అప్పలనాయుడును తేనేటి విందుకు ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.



పామూరు: పింఛన్‌ను అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

పేదల కళ్ళల్లో ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

వెలిగండ్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పేదల కోసం పని చేస్తూ వారి కళ్ళల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. శనివారం మండలంలోని గుడిపాటిపల్లి గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు ఆయన వెళ్లి పింఛన్లను అందజేశారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను వింటూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తున్నదని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చరిత్రలో నిలిచి పోతాయన్నారు.

కాగా, వెలిగండ్ల మండలంలో శనివారం 87 శాతం పింఛన్లను పంపిణీ చేశారు.



వెలిగండ్ల: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ బాషా, తహసీల్దార్ సువర్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, గోనా ప్రతాప్, బీరం వెంకటేశ్వర్లు, మీనిగ కాశయ్య, గంజి రాజశేఖర్‌రెడ్డి, యేరువ చెంచిరెడ్డి, వెన్నా రమణారెడ్డి, గోనా బర్నబాసు, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

దర్శి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో శనివారం మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీనే పింఛన్లు అందుతుండటంతో అవ్వా, తాతల కళ్లల్లో ఆనంధం చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎంపీడీవో ఎల్.కృష్ణమూర్తి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గొర్రె సుబ్బారెడ్డి, రామిరెడ్డి, దారం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



దర్శి: కొత్తపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాపారావు తదితరులు

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

» మసీదుల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు

పామూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర ఖురాన్ గ్రంధం అవతరించిన పవిత్ర మాసం రంజాన్. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో ఆదివారం నుంచి రంజాన్ ఉపవాసాల నిర్వహణకు ముస్లింలు సన్నాహాలు ప్రారంభించారు. నెలరోజుల పాటు కఠిన ఉపవాసాలు ఆచరిస్తారు. ప్రతిఒక్కరూ అల్లాహ్ ఆదేశానుసారం రోజా (ఉపవాసం)ఉంటూ ఆయన చూపిన మార్గంలో పయనించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తారు.

రంజాన్ నెల ప్రారంభం నుంచి ప్రతిరోజు తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఉపవాస దీక్ష ప్రారంభానికి అవసరమైన ఆహార పదార్థాలను తయారు చేసుకుంటారు. కుటుంబసభ్యులందరూ ఒకచోట చేరి భక్తి పూర్వకంగా సెహరి స్వీకరిస్తారు. దీక్ష ప్రారంభసమయం ముగియగానే ప్రార్థనల కోసం సమీప మసీదులలోకి వెళ్లి తమ పాపాలను క్షమించాలని అల్లాహ్‌ను వేడుకుంటారు. తమ ఉపవాసాలకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని, రంజాన్‌నెల పుణ్యఫలాలను దక్కేలా చూడాలని వేడుకుంటూ ఇఫ్తార్ (ఉపవాస దీక్ష విరమణ) చేస్తారు. రాత్రి ఇషా నమాజ్ తరువాత తరావీ ప్రత్యేక ప్రార్థనలకు ఆయా మసీదు నిర్వాహణ కమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఈసందర్భంగా పట్టణంలోని ఐదు మసీదులతో పాటు, మండలంలోని నుచ్చుపొద, మోపాడు, లక్ష్మీ నరసాపురం, కందువారిపల్లి, వగ్గంపల్లి గ్రామాల్లోని మసీదులకు రంగులు వేయించి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

» జిల్లా బీసీ సంక్షేమాధికారిణి అంజల

దొనకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో పదో తరగతి చదివే విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి ఎం.అంజల పేర్కొన్నారు. దొనకొండలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లోని అన్ని గదులను, పరిసరాలను పరిశీలించి సంక్షేమాధికారికి పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో విలువైన సమయాన్ని వృథా చేయవద్దన్నారు. పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించి హాస్టల్‌కు మంచిపేరు తేవాలన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పాఠశాలలో నిర్వహించిన ప్రీఫైనల్ పరీక్షల ఫలితాలపై ప్రశ్నించి పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన పలుఅంశాలను అవగాహన కల్పించారు.

అనంతరం బీసీ బాలికల వసతీ గృహాన్ని తనిఖీ చేసి స్వచ్ఛాంధ్ర కింద హాస్టల్‌కు మంజూరైన ఎనిమిది టాయిలెట్స్ నిర్మాణం గురించి చర్చించారు. కార్యక్రమాల్లో జిల్లా సహాయ బీసీ సంక్షేమాధికారి శ్రీనివాసులు, బీసీ వసతి గృహ సంక్షేమాధికారులు భూమా సురేష్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారిణి అంజల

పోలీసుస్టేషన్ నిర్వహణపై విద్యార్థినులకు అవగాహన

ముండ్లమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్ నిర్వహణపై విద్యార్థినులు, ఉపాధ్యాయినులకు ఎస్‌ఐ వై.నాగరాజు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ వారం రోజులపాటు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం కస్తూర్బాగాంధీ, ఏపీ మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు, ఉపాధ్యాయినులకు పోలీసు స్టేషన్ పట్ల అవగాహన కల్పించి పోలీసులు చేస్తున్న విధులు వివరించారు. ప్రధానంగా మహిళలకు లాకప్ గది, మహిళా పోలీసుల విధులు వివరించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఎదుర్కోవాల్సిన వాటిపై పోస్టర్ ద్వారా వివరించారు.

కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: పాఠశాల విద్యార్థులతో సీఐ భీమానాయక్

పామూరులో..

పామూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ నిర్వహణ, విధులు గురించి స్థానిక వివేక హైస్కూల్ విద్యార్థులకు శనివారం సీఐ ఎం.భీమానాయక్ అవగాహన కల్పించారు. ఓపెన్ హౌస్‌లో భాగంగా విద్యార్థులు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో ఎస్‌ఐ విధులు, రైటర్ బాధ్యతలు, సిబ్బంది పనితీరు సెల్, కంప్యూటర్ గది, రైఫిల్ వాడకం గురించి వివరించారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

దర్శి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో పేలబ్రోలు చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత అంబులెన్స్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ట్రస్టు అధినేత మంచినేని శ్రీనివాసరావు, సతీమణి మాధవిలు పేదల కోసం ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటుచేయటం సంతోషకరమన్నారు. ఇక్కడి రోగులు అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో ఉచిత అంబులెన్స్ సేవలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఝాన్సీ హాస్పటల్స్ అధినేత డాక్టర్ కోటిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రమణ అన్నారు. శనివారం మండలంలోని శంకరాపురం, వేంపాడు గ్రామాల్లో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌లను రూ.4 వేలకు పెంచి పేద ప్రజలను ఆదుకుంటున్నట్టు చెప్పారు. పింఛన్ పొందుతున్న ప్రతిఒక్కరిని ఆయన గౌరవంగా నమస్కారం చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

ముండ్లమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లమూరు - అద్దంకి ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. అద్దంకి నుంచి దర్శికి కొబ్బరి బోండాలకు ఆటో వెళుతుంది. ఈక్రమంలో అదుపుతప్పి బోల్తాపడటంతో అందులోఉన్న రాజేష్, సురేంద్రలకు స్వల్పగాయాలయ్యాయి.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం

ముండ్లమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన శనివారం రాత్రి మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారంలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఇమాంజలితో నూజెండ్లపల్లి గ్రామానికి చెందిన నూనె మరియదాసుతో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇటీవల ఆమె తల్లి చాయమ్మ ఇతర ప్రాంతాలకు పొగాకు బ్యార్నీ పనులకు వెళ్ళింది. ఇమాంజలి పుట్టింట్లో ఉండటంతో భర్త మరియదాసు మూడు రోజుల క్రితం అగ్రహారం వచ్చారు.

తనతో మెట్టినింటికి రావాలని భర్త గొడవ చేస్తున్నాడు. ఇమాంజలి తన తల్లి చాయమ్మ అనారోగ్యంతో ఉందని, ఇప్పుడు రాలేనని చెప్పటంతో ఇద్దరు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో మరియదాసు బ్లేడుతో చేయి కోసుకున్నాడు. వెంటనే బంధువులు 108లో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు ఆస్పత్రిలో మరియదాసుకు చికిత్స చేస్తున్నారు.

క్షణికావేశంతో బ్లేడుతో గాయం చేసుకున్నాడు. ఇమాంజలి స్వయాన మరియదాసుకు అక్క కుమార్తె.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

ముండ్లమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రులు కన్న కలలు సాకారం చేయాలని ఎంఈవో ఎస్.సుబ్బారావు అన్నారు. శనివారం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టమైనా ఇష్టంతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలపై ఎంతో నమ్మకం పెట్టుకొని పాఠశాలలకు పంపుతుంటారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. సభకు ప్రిన్సిపాల్ కె.హర్షచంద్రరరావు అధ్యక్షత వహించగా, ఎంఈవో - 2 వెంకటేశ్వర్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత, ముండ్లమూరు హెచ్‌ఎం మాధవీలత, ఈదర, పూరిమెట్ల, అగ్రహారం, మారెళ్ళ, వేముల హెచ్‌ఎంలు సుబ్బారావు, ఆచారి, శ్రీనివాసరావు, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుతో కార్యకర్తకు భరోసా

పామూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వాలతో టీడీపీ ముందుకుపోతున్నదని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. శనివాంం మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో సభ్యత్వాల కార్డులను ఆయన అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏ ప్రాంతీయ పార్టికి లేని కార్యకర్తల మద్దతు టీడీపీకి ఉందన్నారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, మోపాడు ప్రాజెక్టు సూపర్‌చైర్మన్ చుంచు కొండయ్య, గోళ్ల భాస్కరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య ఏలూరి నరసింహారావు, గోళ్ల వీరబాబు, సనుమూరి వెంకటేశ్వర్లు, ఓరుగంటి సుబ్బమ్మ, ఉడుతా కిశోర్, యాదాల చెన్నకేశవులు, మల్లెల శ్రీనివాసులు, కొండా మాలకొండయ్య, కోలా కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో 93శాతం పింఛన్లు పంపిణీ

తాళ్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివాంం 93శాతం పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో దారా హనుమంతరావు గ్రామాల్లో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ తీరును పరిశీలించారు. మండలంలో 6145 మందికిగాను మొదటిరోజు 5656 మందికి పంపిణీ చేశారు. తాళ్లూరులో జరిగిన పెన్షన్ల పంపిణీలో టీడీపీ యువనాయకుడు ఐ.శ్రీనివాసరెడ్డి, తూము శివనాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ క్రిష్టారెడ్డి పాల్గొన్నారు. కాగా, ఆయా గ్రామాల్లో స్థానిక టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.

పామూరు: మండలంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేస్తుందని ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు. మోపాడు, తూర్పుకట్టకిందపల్లి గ్రామ సచివాలయ పరిధిలో శనివారం జరిగిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపీణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తాళ్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీకే జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 106 మంది విద్యార్థులకుగాను 96 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల చీఫ్ గురవయ్య, డీవో వైవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీచేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఎస్‌ఐ మల్లికార్జునరావు పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.

పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకంపై ఏపీటీఎఫ్ హర్షం

తాళ్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకం ఇవ్వాలని నిర్ణయించటం పట్ల ఏపీటీఎఫ్ మండల శాఖ గౌరవాధ్యక్షుడు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, అధ్యక్షుడు గుండూరి నాగరాజు, ప్రధానకార్యదర్శి నారిపెద్ది శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో పాఠశాలలకు కేటాయించిన నిధులు అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులకు చెల్లించాల్సి వచ్చేదన్నారు. ఉచిత బిల్లు విధానంతో పాఠశాలల్లో నిధుల ఖర్చుకు కొంత వెసులుబాటు ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులు లేకపోవడంద్వారా ఆనిధులను పాఠశాలల అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చునని వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పాఠశాలల అభివృద్ధికి దోహదపడుతుందని హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

కనిగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన ఘటన శనివారం పునుగోడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటనరసయ్య(57) ఆంజనేయస్వామి దేవస్థానం తిరునాళ్ల సందర్భంగా కట్టిన ఫెక్సీని తొలగిస్తున్నారు. ఈక్రమంలో ప్లెక్సీ అదుపుతప్పి పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఫ్లెక్సీ పట్టుకోబోయిన మరోవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

కనిగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎంపీపీ దంతులూరి ప్రకాశం ఆరోపించారు. బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత కల్పించ లేదని ఆరోపిస్తూ శనివారం స్థానిక ఒంగోలు బస్టాండ్‌లోగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ధ్వజమెత్తారు. దళితులకు సంబంధించిన 27 పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో దళిత, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

కనిగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో మహిళా దినోత్సవ వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డి.అనురాధ, కార్యకర్తలు కల్యాణి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని యువకుడికి గాయాలు

కురిచేడు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బైకులు ఢీకొన్న ప్రమాదంలో దొనకొండ మండలం భూమనపల్లి గ్రామానికి చెందిన దారా గోపి అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శనివారం సాయంత్రం కురిచేడు మండలం పొట్లపాడు గ్రామం వద్ద చోటుచేసుకుంది. భూమనపల్లి గ్రామానికి చెంది దారా గోపి, మరో యువకుడు పొట్లపాడు గ్రామా నికి మిర్చి కోతకు వచ్చారు. శనివారం సాయంత్రం పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో రైల్వే అండర్‌పాస్ మలుపు వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిని గోపిని 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుంచి ఈనెల 30 తేది వరకు గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్టు సీఎస్‌పురం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.రమేష్ తెలిపారు. జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సీఎస్‌పురంలో శనివారం 95 గేదెలకు, 18 ఆవులకు వ్యాధి నిరోధిక టీకాలు వేసినట్టు డాక్టర్ షేక్ మునీర్ తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పామూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఆమె అధ్యక్షతన నిర్వహించారు. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్జీవో షేక్ నాయబ్‌రసూల్, కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సజన, తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

నీటి పథకాలకు.. నిధులు

"మున్సిపల్ పట్టణాల్లోని ప్రజలకు తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరిపోను న్నాయి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన తాగునీటి పథకాల పనులు ఎట్టకేలకు పట్టాలెక్కనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు తీర్చాలని నిర్ణయించి ఆసియా మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు(ఏఐఐబీ) నిధులతో రాబేయే 33 సంవత్సరాల జనాభా సంఖ్యను దృష్టిలో పెట్టుకుని తాగునీటి పథకాలను చేపట్టిం ది. వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వాడేసుకుని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో అధికా రం చేపట్టిన కూటమి ప్రభుత్వం తిరిగి ఆ పనులపై దృష్టి సారించింది. అయితే ఏఐఐబీ ఒప్పంద గడువు ముగిసింది. దీంతో ఏఐఐబీని రద్దు చేసి ఆ స్థానంలో అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(యుఐడీఎఫ్) అమలుకు సిద్ధమైంది. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని తాగునీటి పథకాలకు రూ.961.37 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులు చేపట్టాలని పబ్లిక్‌హెల్త్ శాఖను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిం చింది. దీంతో త్వరలో ఆయా మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి పథకాలు ప్రారంభం కానున్నాయి."

- రూ.961.37 కోట్లు మంజూరు
- గడువు ముగియడంతో ఏఐఐబీ రద్దు
- యుఐడీఎఫ్ పథకంలో పథకాల విస్తరణకు చర్యలు
- వైసీపీ హయాంలో నిలిచిన పనులు ఎట్టకేలకు ప్రారంభం
- పురపాలక సంఘాల్లో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

వైసీపీ నిర్లక్ష్యం.. కూటమి శ్రద్ధ

టీడీపీ హయాంలో జరిగిన ఒప్పందం మేరకు తాగునీటి పథకాల విస్తరణకు ఏఐఐబీ నుంచి విడుదలైన నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. అయితే అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వాటా ధనం విడుదల చేయలేదు. పైగా ఏఐఐబీ నిధులను వాడేసుకుంది. దీంతో తాగునీటి పథకాల విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఐదేళ్ల తాగునీటి పథకాలపై కనీసంగా కూడా దృష్టి సారించకుండా నిర్లక్ష్యం వహించింది. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి పథకాల విస్తరణ పనులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. నిలిచిన పనుల స్థితిగతులు.. వ్యయ అంచనాలను తాజాగా రూపొందించిన ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను విడుదల చేసింది.

(నరసరావుపేట. ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో తాగునీటి పథకాలపై అలుముకున్న నీలినీడలు తొలగిపోతున్నాయి. వైసీపీ హయాంలో నిలిపివేసిన నీటి పథకాల పనులను పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిలిచిపోయిన నీటి పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తాజాగా రూ.961.37 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడువు పూర్తవడంతో ఏఐఐబీను రద్దు చేసి దీనిస్థానంలో అర్బన్ యుఐడీఎఫ్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించగా.. కూటమి ప్రభుత్వం ఇబ్బందులను తీర్చేందుకు దృష్టి పెట్టడంపై ఆయా పట్టణాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఐఐబీ నిధులతో వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, గుంటూరు కార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి మున్సిపాల్టీలలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాల విస్తరణ చేపట్టింది. రానున్న 33 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి ఆయా మున్సిపాల్టీల్లోని నీటి పథ కాల ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఏఐఐబీ రుణం 70 శాతం

(మిగతా 6వ పేజీలో)

మునిసిపాల్టీ	నిధులు (రూ. కోట్లలో)
పిడుగురాళ్ల	155.85
మాచర్ల	95.91
వినుకొండ	184.51
గుంటూరు	186.82
మంగళగిరి	105.79
తాడేపల్లి	146.44
అద్దంకి	86.05



పిడుగురాళ్లలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

వాటర్ గ్రిడ్ సాధ్యంకాకే..

గుంటూరు, పల్నాడు బాపట్ల జిల్లాల్లోని పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు వాటర్‌గ్రిడ్ ద్వారా నీటిని సరఫరాకు ప్రభుత్వం కసరత్తు చేసింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో వాటర్‌గ్రిడ్ సాధ్యం కాదని ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల తేల్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుఐడీఎఫ్‌ను అమలు చేస్తోంది. మిగతా మున్సిపాల్టీల్లో అమృత్ 2.0 పథకం కింద నీటి పథకాలను విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అటు అమృత్.. ఇటు యుఐడీఎఫ్ పథకాలతో ముడు జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీలలో నీటి పథకాలకు మహర్దశ పట్టనుంది.



బాపట్ల జూనియర్ కళాశాల కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఆర్డీవో గ్లోరియా


ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 430 మంది విద్యార్థులు గైర్హాజరు
- బాపట్ల కళాశాల కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శనివారం ప్రారంభమయ్యాయి. 36 కేంద్రాలను ఏర్పాటు చేయగా అవకతవకలకు అవకాశం లేకుండా ప్రతి కేంద్రంలో సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పట్టణంలోని బాపట్ల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జె.వెంకటమురళి తనిఖీ చేశారు. కేంద్రంలోని గదులను కలియ తిరిగి పరీక్షల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలో 357మంది విద్యార్థులకు 349 మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 36 కేంద్రాలలో 10,357 మందికి 9,927 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని కలెక్టర్ చెప్పారు. 430 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అధికారులు పగడ్బందీగా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, ప్రధానాచార్యులు జి.కోటేశ్వరరావు, సీఎస్‌టీ భవానీ తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి వారబందీ

నేటి నుంచి జోన్-1కు నీటి సరఫరా బంద్



నాగార్జున సాగర్ జలాశయంలో తగ్గిన నీటి నిల్వ

నరసరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో ఆదివా రం నుంచి వారబందీ అమలు కానున్నది. జోన్-1 పరిధి కాల్వలకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నారు. జలా శయంలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో జల వనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఉన్న నీటిని సర్ది వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తిరిగి 8వ తేదీ నుంచి నీటి సరఫరా చేయనున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. 9 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. తదుపరి ఆరు రోజులు నీటి సరఫరాను నిలిపివేస్తారు. వారబందీ అమలుపై వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారబందీ విధానంలో మార్చి 31 వరకు పంటలకు నీటి సరఫరా చేయనున్నట్లు జలవనరులశాఖ ఈఈ కృష్ణ మోహన్ తెలిపారు. సాగర్ నుంచి కుడి కాల్వ నీటి సరఫరాను 5 వేల క్యూసెక్కులకు తగ్గించారు. సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 167.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.28 (ఆదివారం)

సహరి : 5.11 (సోమవారం)

డ్వాక్రా @ ఈ-కామర్స్

- ఈ-వ్యాపారంలోకి మహిళల రంగప్రవేశం
- ఆన్‌లైన్‌లో 1050 ఉత్పత్తుల వివరాలు లభ్యం
- ఇప్పటికే 2,800 మంది ఎంటర్‌ప్రెన్యూర్లుగా నమోదు
- ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో పలు దఫాలుగా అవగాహన సదస్సులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మహిళల స్వయం సాధికారతే లక్ష్యంగా పురుడు పోసుకున్న డ్వాక్రా సంఘాలు దినదిన ప్రవర్ధమానంగా ఎదిగాయి. వేల సంఖ్యలో గ్రూపులు, లక్షల్లో సభ్యులుగా మహిళలు స్థానిక వ్యాపారాలతో ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. బ్యాంకులు అందించే రుణాలతో డ్వాక్రా సంఘాలు వారి వారి ఆలోచనలకు తగినట్లు రకరకాల వస్తువులను తయారు చేసి ఎప్పటి నుంచో విక్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలు దాదాపు 1050 రకాలను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో అధికశాతం చేతి వృత్తులే. ఆధునికంగా, ఎంతో నాణ్యతతో కూడిన ఆయా వస్తువుల అమ్మ కాలకు సరైన వేదిక లేదు. దీంతో డ్వాక్రా మహిళలు నష్టాలు చవిచూస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా గ్రూపులను కానీ, వారు తయారు చేసిన వస్తువులకు ఆదరణ కల్పించే కనీస చర్యలు లేవు. ప్రోత్సాహం, ఆదరణ లేకపోవడం.. మరోవైపు విక్రయాలు లేక నష్టాలతో డ్వాక్రా గ్రూపు మహిళలు అయోమయంలో ఉన్నా రు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం చంద్రబాబు మానసపుత్రిక అయిన డ్వాక్రా గ్రూపులపై దృష్టి సారించింది. వారి ఉత్పత్తుల అమ్మకాన్ని విస్తృత పరచడం ద్వారా మహిళలు మరింతగా ఆర్థిక స్థిరత్వం సాధించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. ఈ క్రమంలో డ్వాక్రా మహిళలను ఎంటర్ ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దడానికి ఉన్న అన్ని అవకాశాలపై కసరత్తు చేసింది. ఇందులోభాగంగా డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలోకి తీసుకురావడం ద్వారా అమ్మకాల విస్తృతిని పెంచడంతో పాటు పెద్దఎత్తున ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. ప్రభుత్వం పరిశ్రమలశాఖ ద్వారా ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ (ఓఎన్‌డీసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. తొలిదశలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 2,800 మంది డ్వాక్రా మహిళలను ఆన్‌లైన్‌లో ఎంటర్‌ప్రెన్యూర్లుగా రిజిష్టర్ చేసే ప్రక్రియను డీఆర్‌డీఏ పూర్తి చేసింది. దశలవారీగా అందరినీ ఈ కామర్స్ గొడుగు కిందకు తెస్తామని డీఆర్‌డీఏ చెబుతోంది. ఇందుకు సంబంధించి డ్వాక్రా సంఘాలకు అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించింది.



ఆన్‌లైన్ ఆర్డర్లకు సంబంధించి డెలివరీకి తినుబండారాలు సిద్ధం చేస్తున్న డ్వాక్రా మహిళలు

డెలివరీ చార్జీలు లేకుండానే..

డ్వాక్రా ఉత్పత్తులకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో అమ్మకాలు కూడా ప్రారంభమయ్యాయి. ఆయా జిల్లాల్లోని వీవోఏలు ఒక్కో గ్రామ సమాఖ్య ద్వారా కనీసం నాలుగు ఉత్పత్తులను ఓఎన్‌డీసీ వెబ్‌సైట్‌లోని మైస్టోర్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దాదాపు 1050 ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వస్తువులు, పచ్చళ్లు, ఇంటి అవసరాలకు పనికొచ్చే సామగ్రి, ఇత్తడి వస్తువులు, చేతి అలంకరణలతో పాటు మరెన్నో ఉత్పత్తులను


(మిగతా 6వ పేజీలో)

అతిపెద్దగా.. ఓఆర్ఆర్



- అమరావతికి మణిహారంగా నిర్మాణం
- 190 కిమీ పొడవు.. 70 మీటర్ల వెడల్పు.. 6 వరసలు
- ఏడు నెలల్లో టెండర్లు.. ఏడాదిలోగా పనులు ప్రారంభం
- మొత్తం ఖర్చు కేంద్రమే భరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక

మంగళగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఔటర్‌రింగురోడ్డు ఏర్పాటుతో ప్రపంచం, దేశంలో చాలా నగరాలు స్వల్ప వ్యవధిలోనే ఎంతగానో అభివృద్ధి చెందాయి. ఈ పరిస్థితుల్లో రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులతోపాటు ఏకకాలంలో ఔటర్‌రింగు రోడ్డును భారీస్థాయిలో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతో ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్ చుట్టూ దేశంలోనే అతిపెద్ద ఔటర్‌రింగురోడ్డును నిర్మించిన చంద్రబాబు.. విభజిత రాష్ట్ర రాజధాని అమరావతి చుట్టూ అంతకన్నా పెద్ద ఔటర్‌రింగు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పైగా రాష్ట్ర ప్రభుత్వానికి నయాపైసా ఖర్చు లేకుండా మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. సుమారు 190 కిలోమీటర్ల నిడివిలో ఏర్పాటయ్యే ఈ ఓఆర్‌ఆర్ 70 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలతో దేశంలోనే అతిపెద్ద ఓఆర్‌ఆర్‌గా నిలవబోతుంది. అమరావతికి మణిహారంగా నిలిచే ఓఆర్‌ఆర్ ప్రాజెక్టును ఏడాదిలోగా పట్టాలెక్కించి ఆపై మూడేళ్లలోగా పూర్తి చేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంగా ఉంది. భూసేకరణ ప్రక్రియను సత్వరమే ప్రారంభించి వచ్చే ఏడు మాసాలలోగా టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తుంది. ఆపై నాలుగైదు మాసాల్లోగా నిర్మాణపనులను మొదలెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓఆర్‌ఆర్ నిర్మాణానికి సుమారు 4,205 ఎకరాలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేస్తుండగా అందులో సుమారు 306 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. దీంతో 3,899 ఎకరాలను సేకరిస్తే సరిపోతుందని భావిస్తున్నారు.



కృష్ణా డెల్టాకు మహర్దశ

అమరావతి ఓఆర్‌ఆర్‌తోపాటు మరో రెండు లింకురోడ్లను అనుసంధానంగా నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్‌ను తూర్పుదిశగా సుమారు 17 కిలోమీటర్లు పొడిగిస్తూ ఆరులేన్ల రహదారిని నందివెలుగు వరకు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ సూచించింది. ఈ కొత్త రహదారి విజయవాడ పశ్చిమబైపాస్-ఎన్‌హెచ్-16ని నందివెలుగు వద్ద ఔటర్‌రింగురోడ్డుతో అనుసంధానం చేస్తుంది. ఈ రహదారితో విజయవాడ తూర్పు బైపాస్ రహదారి అవసరం ఉండదని ఎన్‌హెచ్‌ఏఐ తేల్చిచెప్పింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16తో పశ్చిమ బైపాస్ కలిసే ప్రాంతంలో క్లవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్‌ను సరికొత్తగా నిర్మిస్తారు. ఇక్కడ నుంచి మొదలయ్యే అనుసంధాన రహదారి నంబూరుకు ఉత్తరంగా పెనుమూలి, మంచికలపూడి, కంఠంరాజు కొండూరు, దుగ్గిరాల, చింతలపూడికి ఆవలివైపుగా వెళ్లి నందివెలుగు వద్ద ఓఆర్‌ఆర్‌తో కలుస్తుంది. ఈ రహదారితో పాటు మంగళగిరి-తెనాలి-నారా కోడూరు రూటులో ప్రస్తుతం ఉన్న డబుల్‌లేన్ రోడ్డును నాలుగులేన్ల రహదారిగా అభివృద్ధి చేయబోతున్నట్టు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇక రెండో లింకురోడ్డు విషయానికొస్తే.. బుడంపాడు వద్ద గుంటూరు హైవే జంక్షన్ నుంచి నారాకోడూరు వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్ల పొడవున ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నారాకోడూరు వద్ద ఓఆర్‌ఆర్‌తో లింకు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి మూడు అలైన్‌మెంట్లను పరిశీలిస్తున్నారు.

మూడు దశలు.. 11 ప్యాకేజీలుగా..

ఓఆర్‌ఆర్‌ను 11 ప్యాకేజీలుగా విభజించి మూడు దశలుగా నిర్మించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి గుంటూరు జిల్లా పొత్తూరు వరకు 63 కిలోమీటర్ల పొడవునా మొదటి దశలో పనులను చేపట్టబోతున్నారు. ఇందులో కృష్ణానదిపై పల్నాడు జిల్లా బలుసుపాడు- ఎన్టీఆర్ జిల్లా మున్నలూరు మధ్య ఓఆర్‌ఆర్‌కు పశ్చిమ దిశగా 3.15 కి.మీల పొడవున కొత్త వంతెనను నిర్మిస్తారు. రెండో దశలో గుంటూరు జిల్లా పొత్తూరు నుంచి కృష్ణాజిల్లా పొట్టిపాడు వరకు మరో 65 కిలోమీటర్ల నిడివిలో నిర్మాణ పనులను చేపడతారు. ఈ దశలో కృష్ణానదిపై ఓఆర్‌ఆర్‌కు తూర్పుదిశలో గుంటూరు జిల్లా మున్నంగి- కృష్ణాజిల్లా వల్లూరుపాలెం మధ్య 4.8 కిలోమీటర్ల పొడవునా వంతెనను నిర్మిస్తారు. మూడో దశలో పొట్టిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వరకు 62 కిలోమీటర్ల పనులను చేపట్టి ఓఆర్‌ఆర్‌ను పూర్తి చేస్తారు. మూడోదశలోనే జికొండూరు సమీపంలో 4.4 కిలోమీటర్ల పొడవున టన్నెల్ నిర్మాణం జరగనున్నది.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వ్యూ

రెండో ఏడాదీ ధర్మకర్తల మండలి లేకుండానే శింగరకొండ వార్షిక తిరునాళ్ల

- వైసీపీ పాలనలో 15నెలలపాటు జరగని కమిటీ నియామకం
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఆలస్యం

అద్దంకి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వార్షిక తిరునాళ్ల రెండో ఏడాది కూడా ధర్మకర్తల మండలి లేకుండానే జరగనుంది. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల వార్షిక తిరునాళ్ల ఈ నెల 14వ తేదీన జరగనుంది. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి గడువు 2023 మార్చిలో ముగిసినా వైసీపీ ప్రభుత్వంలో కూడా అప్పట్లో కొత్త కమిటీ వేయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆశావాహులు తీవ్ర ప్రయత్నాలు చేసి కూడా చివరకు నిరుత్సాహానికి గురయ్యారు. కోట శ్రీనివాసకుమార్ 2023 మార్చి వరకు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కొనసాగారు. అనంతరం సుమారు సుమారు 15 నెలల తరువాత సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు కూడా కొత్త కమిటీ నియామకం జరగలేదు. లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి మాత్రం గత ఏడాది జూలై వరకు కొనసాగింది. గత వార్షిక తిరునాళ్ల కూడా ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి లేకుండానే నిర్వహించగా, కూటమి ప్రభుత్వం వచ్చి కూడా 9 నెలలు కావస్తున్నా ఇంకా ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండళ్లకు పలువురు నేతలు ప్రయత్నాలు చేసినప్పటికీ ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవుల భర్తీ జరగకపోవడంతో ఆలస్యం అయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 14వ తేదీ జరిగే వార్షిక తిరునాళ్ల కూడా రెండు దేవాలయాలకు కమిటీలు లేకుండానే జరగనుంది.

అన్ని రంగాల అభివృద్ధికి కృషి

ఎంపీ కృష్ణప్రసాద్



పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలోని అన్ని రంగాలనూ అభివృద్ధి చేసేందుకు కచ్చితంగా కృషి చేస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో నిలిచిన అభివృద్ధి పనులను లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడి పరిస్థితులు, స్థితిగతులపై అధికారులతో మాట్లాడారు. వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అలాగే నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ కూటమి నాయకులతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎంపీ వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన మినీ ప్రాజెక్టు ఎక్స్‌పో



మినీ ప్రాజెక్టు ఎక్స్‌పోను పరిశీలిస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం దిగ్విజయంగా మినీ ప్రాజెక్టు ఎక్స్‌పో ముగిసింది. ఈసందర్భంగా కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఈఈఈ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆధునిక టెక్నాలజీపై 17 రకాల ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, కోఆర్డినేటర్ అరుణ్ పాల్గొన్నారు.

నేడు సరస్వతీదేవి విగ్రహానికి గొడుగు నిర్మాణం



హైస్కూల్‌ను పరిశీలించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం స్కూల్‌ను పరిశీలించారు. ఈక్రమంలో గతంలో స్కూల్ ప్రాంగణంలో నిర్మించిన సరస్వతీదేవి విగ్రహానికి గొడుగు నిర్మించాలని తీర్మానించారు. ఈక్రమంలోనే సుమారు రూ.50వేలు వరకు చందాలు పోగుచేసినట్లు వివరించారు. నిర్మాణానికి సంబంధించి ఆదివారం ప్రముఖులతో పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గోశాలకు గడ్డి నిమిత్తం రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, సురేష్, నారాయణమూర్తి, నాగేశ్వరరావు, నారాయణ, ప్రసాద్, సాంబశివరావు, పూర్ణ, రమేష్, రవిచంద్ర పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలతో మేలు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వలన ఆరోగ్యంగా ఉండడంతో పాటు తద్వారా వచ్చే ఆదాయం లాభసాటిగా ఉంటుందని ఏరియా పశు సంవర్థకశాఖ వైద్యుడు సజ్జా చిట్టిబాబు అన్నారు. పశువులలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు శనివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 4నెలలు పైబడిన దూడ నుంచి అన్ని రకాల ఆవులు, గేదెలకు అందుబాటులో ఉన్న సిబ్బంది ద్వారా వేయించాలని సూచించారు.

రూ.95 కోట్ల పొదుపు నిధులు బూడిదపాలు

- గత వైసీపీ అధికార దర్పంతో ఆసరా అధోగతి
- జిల్లాలో పార్టీ అనుయాయులు, వర్గీయులకు కేటాయింపు
- దయనీయంగా స్వయం సహాయక సంఘాలు



సమావేశమైన పొదుపు సంఘాల సభ్యులు (ఫైల్)

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల నిధులను గత వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ఏకంగా రూ.95కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. అధికారంలో ఉండగా, ఆసరా పథకం ద్వారా బాపట్ల జిల్లాకు రూ.95 కోట్లను గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసింది. అంతవరకు బాగానే ఉన్నా పరిపాలనాలోపంతో పాటు అధికార దుర్వినియోగానికి పాల్పడింది. విడుదల చేసిన నిధులు ఉపాధి కూడగట్టుకునే పొదుపు సంఘాలకు కాకుండా వైసీపీ అనుయాయులకు, మద్దతుదారులకు అందించింది. ఈక్రమంలో లబ్ది పొందిన వారు ఉపాధి యూనిట్లు, వ్యాపారాలు నిర్వహించకుండా అవసరాలకు వాడుకున్నారు. దీంతో తీసుకున్న రుణానికి నేడు వడ్డీ లేదు కదా అసలు కట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. దీంతో ప్రస్తుతం నిజంగా రుణ సాయం పొందాల్సి ఉన్న పొదుపు మహిళల పరిస్థితి దయనీయంగా మారింది. వ్యాపారాలు చేయని రుణ గ్రహీతలు తిరిగి చెల్లింపుల్లో మొండికేసేవారు. దీంతో ప్రస్తుతం ఆసరా నగదుకు సంబంధించి జిల్లా సమాఖ్యలో చిల్లి గవ్వ కూడా లేకుండా పోయింది. దీనిపై అధికారులు సక్రమమైన విచారణ జరిపించి నిజమైన పొదుపు సంఘాలకు రుణాలు కేటాయిండంతో పాటు తీసుకున్న నగదుపై విచారణ జరపాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

యూనిట్లు ఏర్పాటు కాలేదు



గతంలో ఆసరా యూనిట్లు ఏర్పాటు కాలేదు. అందించిన నగదును రుణ గ్రహీతలు ఆర్థిక పరమైన అవసరాలకు వినియోగించుకుని ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సమాఖ్య ఖాతా జీరో అయింది. ప్రస్తుతం విజన్ 2047 ద్వారా యూనిట్‌లు కల్పించి ప్రతి ఇంట్లో వ్యాపార వేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాము. ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్తను తయారు చేయడమే ధ్యేయం

- పద్మ, డీఆర్‌డీఏ పీడీ

మహిళల భద్రత ప్రతి పౌరుడిది



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్



ఓపెన్‌హౌస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బరాజు

డీఎస్పీ మొయిన్

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత ప్రతి పౌరుడిపై ఉందని, అలాంటి వాతావరణం సమాజానికి మేలుకరమని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. మహిళా దినోత్సవాల సందర్భంగా ఈపూరుపాలెం గ్రామంలో విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో స్టేషన్ పరిధిలోని ఉమెన్ పోలీసులకు, సచివాలయాల పరిధిలోని సచివాలయ మహిళా పోలీసులకు, విద్యార్థినులకు గోరంట్ల సూపర్ స్పెషాలిటీ సహకారంతో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. శనివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వేటపాలెంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్, మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలి

అద్దంకి : మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా శనివారం పోలీస్ స్టేషన్‌లో 110 మంది మహిళలకు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ హేమామాధురి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి సుబ్బరాజు వివరించారు. ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఓపెన్ హౌస్ సందర్శనలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ పరిశీలించారు. సీఐ పోలీస్ స్టేషన్ గురించి అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలు లకు అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఎదగాలి

పంగులూరు : బాల్యంలో బాల బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఎదగాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బాలరాజేశ్వరి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా పంగులూరు ఉన్నత పాఠశాలలో పోలీసులు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల బాల బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యం పట్ల బాల బాలికలకు డాక్టర్ బాల రాజేశ్వరి అవగాహన కల్పించారు. సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, చదువు, ఆటలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, ఎస్ఐ వినోద్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

బల్లికురవ : మహిళా దినోత్సవంలో భాగంగా పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం చెన్నుపల్లిలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ మహిళలకు, చిన్నారులను పరీక్షించి, మందులు అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ జీవీ చౌదరి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ప్రత్యేక పాత్ర ఉందని అందరూ మహిళను గౌరవించాలని కోరారు. అలానే ప్రజలు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థినులకు పోలీసు స్టేషన్‌ను చూపించి చట్టాలపై అవగాహన కల్పించారు.

బాలికలతో ర్యాలీ

యద్దనపూడి (మార్టూరు) : మహిళా వారోత్సవాలలో భాగంగా శనివారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన మహిళ ఇంటి వద్ద ఆడపిల్ల పేరుమీద మొక్కను నాటారు. ఇంకా గ్రామంలో కవలపిల్లలకు జన్మనిచ్చిన మహిళ ఇంటి వద్ద వారికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు శ్యామసుందరి,ఐసిడిఎస్ సూపర్ వైజరు సుజాత,కార్యకర్తలు పీనాగరాజ, త్రివేణికె సుజాతమ్మ, పీ సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

రుణ సాయంతో ఉపాధికి కృషి

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు రుణ సాయం అందించి, ఉపాధితో ఆర్థికంగా ముందుకు సాగేందుకు నిరంతరం యూనియన్ బ్యాంక్ కృషి చేస్తుందని ఒంగోలు డిప్యూటీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణంలోని చీరాల శాఖ కార్యాలయాన్ని అధికారులు సందర్శించారు. సోమవా రం పద్మశాలీయ కల్యాణ మండపంలో చిన్న, పెద్ద తరహా వ్యాపారులకు రుణాలు మంజూరుతో పాటు బ్యాంకు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల పరిధిలోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌లు యెహోషువ, వెంకట రవీంద్ర, సోమయ్య పాల్గొన్నారు.

సివిల్ సర్వీసులపై విద్యార్థులకు అవగాహన

అద్దంకిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వృక్షశాస్త్రం విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులకు సివిల్స్ గ్రూప్ పరీక్షలు, ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కార్యక్రమం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్. వెంకటరమణ హాజరై విద్యార్థులకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసుల ప్రాధాన్యత, పరీక్ష విధానం, వ్యక్తిగత శ్రద్ధ, కృషితో పాటు ఇతర పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అతిథిని శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, అశోక్‌కుమార్, మస్తాన్‌వలి, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

మసీదుల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు

పామూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర ఖురాన్ గ్రంధం అవతరించిన పవిత్ర మాసం రంజాన్. శనివా రం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో ఆదివారం నుంచి రంజాన్ ఉపవాసాల నిర్వహణకు ముస్లింలు సన్నాహాలు ప్రారంభించారు. నెలరోజుల పా టు కఠిన ఉపవాసాలు ఆచరిస్తారు. ప్రతిఒక్కరూ అల్లాహ్ ఆదేశానుసారం రోజా (ఉపవాసం)ఉంటూ ఆ యన చూపిన మార్గంలో పయనించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తారు.

రంజాన్ నెల ప్రారంభం నుంచి ప్రతిరోజు తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఉపవాస దీక్ష ప్రారంభానికి అవసరమైన ఆహార పదార్థాలను తయా రు చేసుకుంటారు. కుటుంబసభ్యులందరూ ఒకచోట చేరి భక్తి పూర్వకంగా సెహరి స్వీకరిస్తారు. దీక్ష ప్రారంభసమయం ముగియగానే ప్రార్థనల కోసం సమీప మసీదులలోకి వెళ్లి తమ పాపాలను క్షమించాలని అ ల్లాహ్‌ను వేడుకుంటారు. తమ ఉపవాసాలకు తగిన ప్ర తిఫలం ఇవ్వాలని, రంజాన్‌నెల పుణ్యఫలాలను దక్కేలా చూడాలని వేడుకుంటూ ఇఫ్తార్ (ఉపవాస దీక్ష విర మణ) చేస్తారు. రాత్రి ఇషా నమాజ్ తరువాత తరావీ ప్రత్యేక ప్రార్థనలకు ఆయా మసీదు నిర్వాహణ కమిటీ లు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఈసందర్భంగా పట్టణంలోని ఐదు మసీదులతో పాటు, మండలంలోని నుచ్చుపొద, మోపాడు, లక్ష్మీ నరసాపురం, కందువారిపల్లి, వగ్గంపల్లి గ్రామాల్లోని మసీదులకు రంగులు వేయించి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

అద్దంకి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఎంతో నిష్ఠగా చేసే ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలోని ముస్లింలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాసం ఆధ్యాత్మికపరమైనదే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. భగవంతుని ఆశీస్సులు తప్పక లభిస్తాయన్నారు.

తారు రోడ్ల నిర్మాణానికి రూ.6.84 కోట్లు మంజూరు

అద్దంకి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 4 తారు రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా 6.84 కోట్ల రూపాయలు మంజూరైనట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలంలో నామ్ రోడ్డు నుంచి గోవాడ వరకు1.20 కోట్ల రూపాయలు, బల్లికురవ మండలం వైదన నుంచి చెన్నుపల్లి వరకు 3 కోట్ల రూపాయలు, సంతమాగులూరు మండలం సజ్జాపురం రోడ్డు కు 1.20 కోట్ల రూపాయలు, కొరిశపాడు మండలం లో మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు 1.44 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు.



ఆన్‌లైన్ అమ్మకాలపై డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ పద్మ (ఫైల్)

డ్వాక్రా @ ఈ-కామర్స్

(5వ పేజీ తరువాయి)

ఓఎన్‌డీసీ పోర్టల్‌లో ఉంచారు. ఈ వేదిక ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను బుక్ చేసుకునే వినియోగదారులపై అదనపు భారం పడకుండా డెలివరీ చార్జీలను ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలతో పోల్చుకుంటే చౌకగా వస్తువులు దొరికే వీలున్నందున భవిష్యత్‌లో పెద్దఎత్తున డ్వాక్రా ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరగడం ఖాయమనే ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రక్రియపై ప్రజల్లో ప్రచారం కల్పించాల్సి ఉంది. దిగ్గజ కంపెనీల ఉత్పత్తులన్నీ బ్రాండ్‌ను ప్రమో ట్ చేసుకుంటూ పెద్దఎత్తున ఆన్‌లైన్ వాటాను చేజిక్కించుకున్నాయి. ఓ అంచనా ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికల మీద ఇంటి అవసరాలకు ఉపయోగపడే సామగ్రిపై రోజుకు జరిగే వ్యాపారం అక్షరాల రూ.4 కోట్లుగా లెక్క తేల్చారు. ఈ పోటీని తట్టుకుని డ్వాక్రా మహిళలు నిలబడడానికి ప్రభుత్వం ఇచ్చే ఊతానికి తోడు వారు కూడా అవగాహన తెచ్చుకోవడంతో పాటు వినూత్న పద్ధతులలో తమ ఉత్పత్తులను ప్రమోట్ చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా ఇలా...

బాపట్ల జిల్లాలో 1024 గ్రామైక్య సంఘాలలో 33,430 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 1050 సంఘాలకు 35,000 మంది, గుంటూరు జిల్లాలో 575 సంఘాలలో 16,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా గ్రామైక్య సంఘాల నుంచి ఆసక్తితో పాటు ప్రాథమికంగా ఆన్‌లైన్‌పై అవగాహన కలిగిన వారిని ఎంపిక చేసి ఎంటర్‌ప్రెన్యూర్లుగా డీఆర్‌డీఏ రిజిస్ట్రేషన్ చేసింది. ఒక్క బాపట్ల జిల్లాలోనే వీరి సంఖ్య 693గా ఉండగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే 2,800గా ఉంది. ఇప్పటికే ఆన్‌లైన్ వేదికగా జరిగిన లావాదేవీల మొత్తం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే రెండు లక్షల దాకా ఉన్నట్లు యంత్రాంగం చెబుతోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి నాణ్యతతో ఉత్పత్తులు తయారు చేస్తున్నా మార్కెటింగ్ అవకాశాలు లేక ఇబ్బందులు పడిన తమకు కూటమి ప్రభుత్వం తీసుకున్న స్మార్ట్ నిర్ణయంతో లబ్ది చేకూరనున్నదని డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి పథకాలకు నిధులు

(5వ పేజీ తరువాయి)

30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. ఏఐఐబీ ఇచ్చే రుణంను కేంద్ర ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుంది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వాడేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 30 శాతం నిధుల మాట ఎలా ఉన్నా రుణం నిధులను దారి మళ్లించడంతో పథకాలు నిలిచిపోయాయి. ఐదేళ్ల తాగునీటి పథకాల విస్తరణ పనులపైన, ప్రజల తాగునీటి ఇబ్బందులపైన వైసీపీ పాలకులు దృష్టి సారించలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపాల్టీలలో తాగునీటి సమస్యలు పరిష్కారిస్తామని, తాగునీటి పథకాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన తర్వాత ఆ పనులపై దృష్టి సారించింది. అయితే ఏఐఐబీ పథకం గడువు పూర్తి కావడంతో సదరు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీని స్థానంలో యుఐడీఎఫ్ పథకం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో కూడా 70 శాతం రుణం.. 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా నిధులు మంజూరు చేశారు.

పెరిగిన వ్యయం

ఐదేళ్లుగా తాగునీటి పథకాల విస్తరణ పనులు నిలిచిపోవడంతో వ్యయం పెరిగింది. కొత్త రేట్ల ప్రకారం నీటి పథకాలకు వ్యయం అంచనాలను పబ్లిక్ హెల్త్ శాఖ రూపొందించింది. ఈ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నీటి నిల్వ చెరువుల ఆధునీకీకరణ, పైపులైన్ల నిర్మాణం, నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి ప్లాంట్ల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. గృహాలకు నీటి సరఫరా కోసం డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మిస్తారు. మాచర్లలో సుమారు రూ.55 కోట్లతో పనులు చేపట్టగా 10 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. పిడుగురాళ్లలో రూ.102 కోట్లతో పనులు చేపట్టగా 20 శాతం కూడా పూర్తి కాలేదు. వినుకొండలో రూ.138 కోట్లతో చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు. ఇక్కడ కూడా 20 శాతం లోపే పూర్తయాయి. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయకపోవడంతో దాదాపు రూ.141 కోట్లుగా వ్యయం పెరగడం గమనార్హం. ఇదే పరిస్థితి గుంటూరు కార్పొరేషన్ సహా మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి మున్సిపాల్టీల్లో నెలకొంది.

మునిసిపల్ కార్మికుల గోడు పట్టించుకోవాలి

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగేళ్లుగా మునిసిపల్ కార్మికులు పడుతున్న అవస్థలు పట్టించుకోవాలని పలువురు ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) చీరాల నాయకులు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గతంలో ధర్నా చేసిన సమయంలో చర్చలు జరిపిన గత ప్రభుత్వం జీతాలు చెల్లించనున్నట్లు ఆదేశాలు ఇచ్చారు. కానీ అమలు జరగలేదు. నిత్యం శ్రమపై ఆధారపడి జీవించే వారి గోడు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోటి దాసు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, బాపట్ల శ్రీనివాసరావు, మాల్యాద్రి, సురేష్, సుబ్బారాయుడు, ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి రూ.57.47 కోట్లు మంజూరు

- జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గానికి నిధులు

మంత్రి గొట్టిపాటి

అద్దంకి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జల జీవన్ మిషన్ ద్వారా అద్దంకి నియోజకవర్గంలోని గ్రామాలలో రక్షిత తాగునీటి సరఫరా, ఆర్‌వో ప్లాంట్‌ల నిర్మాణం, పైప్‌లైన్‌ల ఏర్పాటు, ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు తదితర పనులకు రూ.57.47కోట్లు మంజూరైనట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో గ్రామాలలో దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచినా పేదలకు మంచినీళ్లిచ్చే ప్రాజెక్టులకు మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయలేదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలజీవన్ మిషన్ జీవం కూడా తీసేశారన్నారు. కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ లక్ష్యాలు చేరుకుంటుందన్నారు. పల్లె పండుగ ద్వారా గ్రామాల రూపురేఖలు మార్చుతున్నామని రవికుమార్ అన్నారు.

అనంతవరం చెరువుకు బొప్పూడి లిఫ్ట్ నీరు

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో అధికారుల చర్యలు



బండోడి చెరువుకు తాగునీటిని మళ్లించేందుకు కాలువ తీస్తున్న ఎక్స్‌కవేటర్

యద్దనపూడి, (మార్టూరు) మార్చి1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముందు చూపుతో వ్యవహరించడంతో యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో గ్రామస్థులు తాగునీటికి ఉపయోగించే బండోడి చెరువుకు శుక్రవారం నుంచి తాగు నీరు చేరుతోంది. దాంతో ఈ వేసవిలో గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఉండవని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా గ్రామంలో ప్రజలందరూ తాగునీటికి వినియోగించే బండోడి చెరువులో గత 10 రోజుల కిందటే నీళ్లు అడుగంటిపోయాయి. అయితే ఈ చెరువులోకి యద్దనపూడి బ్రాంచి కెనాల్ నుంచి నూతలపాడు మైనర్ కాలువ ద్వారా సాగర్ జలాలు వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం సాగర్ జలాలు సమృద్ధిగా రాకపోవడంతో బండోడి చెరువుకు నీళ్ల చేరే విషయంపై ప్రత్యామ్నాయ మార్గాలను టీడీపీ గ్రామ నాయకులు గుదే తారకరామారావు, కొరటాల వంశీతో పాటు పలువురు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని బొప్పూడి లిఫ్టునుండి తమ గ్రామంలోని చెరువుకు నీళ్ల చేరే అవకాశాలు ఉన్నాయని, గతంలో కొన్నేళ్ల కిందట ఇదేవిధంగా చెరువుకు నీళ్ల పెట్టామని నాయకులు ఎమ్మెల్యే ఏలూరికి తెలియచేశారు. దాంతో ఏలూరి ఈ విషయమై పరిశీలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్ చంద్రను ఆదేశించారు. తరువాత డీఈ సతీష్ చంద్ర వెంటనే రంగంలోకి దిగి గ్రామ నాయకులను తీసుకొని బొప్పూడి లిఫ్ట్ వద్దకు వెళ్లి పరిశీలించారు. తదనంతరం ఈ లిఫ్టు నుంచి పసుమర్తి సమీపంలోని ఒక చెరువుకు నీటిని పంపిస్తే అక్కడి నుంచి బండోడి చెరువుకు నీళ్ల చేరడానికి తాత్కాలికంగా ఎక్స్‌కవేటర్‌తో కాలువను తవ్వించారు. ఈ నేపథ్యంలో చెరువుకు నీళ్ల చేరుతున్నాయి. దాదాపుగా 10 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన చెరువులో వారం రోజుల పాటు నీళ్లను పెట్టినట్లయితే ఈ ఎండా కాలంలో గ్రామంలో మంచి నీటి ఎద్దడి ఉండదని గ్రామస్థులు అంటున్నారు.

ముందస్తుగా ఎమ్మెల్యే ఏలూరి అధికారులను అప్రమత్తం చేయడంతో అనంతవరం గ్రామానికి వేసవి కాలంలో తాగునీటి బెడద తొలగిందని గ్రామస్థులు అంటున్నారు.



ఫేర్‌వెల్ సభలో మాట్లాడుతున్న హెచ్‌ఎం హనుమంతురావు

ఇష్టంతో కష్టపడి చదవాలి

బల్లికురవ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థీ ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హనుమంతురావు కోరారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దిగువ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చదువులో ఉన్నతంగా ముందుకు సాగేలా ఉపాధ్యాయులు వారికి సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను కేరింతల మధ్య నిర్వహించారు. పాఠశాల విద్యార్థులందరూ కార్యక్రమంలో ఆనందంతో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ మల్లికార్జునరావు

పంగులూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సైబర్ నేరాలు పెరిగాయని, ప్రజలు సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని చందలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీస్ అధికారులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. లాటరీ పేరుతో, నగదు ప్రోత్సాహకాలతో, బ్యాంక్ ఎకౌంట్లల ఆన్‌లైన్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌కు తొందరపడి స్పందించడం మంచిది కాదన్నారు. కొత్త నెంబర్లతో వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించి మోసపోవద్దని, సైబర్ మోసాలకు గురైన సందర్భంలో వెంటనే 1930 నెంబరుకు సమాచారం ఇవ్వావలని సూచించారు. మహిళల భద్రతపై పోలీస్ చర్యలను వివరిస్తూ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వినోద్‌బాబు, నాయకులు రామలింగస్వామి, మురకొండ సుబ్బారావు, అడ్డగడ సుబ్బయ్య, కందిమళ్ల రామాంజనేయులు, పెంట్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నేతలు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈక్రమంలో అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. వర్గీకరణే లక్ష్యంగా ఎందరో అసువులు బాసినట్లు చెప్పారు. అయితే అందుకు సంబంధించి ప్రస్తుతం పూర్తిస్థాయిలో విజయం సాధించడం ఆనందదాయకమని వారు అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, డీ వందనం, అశోక్, అభిషేక్, రాంబాబు, వంశీ, చైతన్య పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా జాతి కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగం మాదిగ జాతిలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఎంఆర్‌పీఎస్ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి తేల శ్రీనివాసరావు మాదిగ అన్నారు. శనివారం అంబేడ్కర్ భవనంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఇతర అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు పూనూరి రమేష్, సీనియర్ నాయకుడు పూనూరి నరేంద్ర, మండల అధ్యక్షుడు చక్రవర్తి, ఆంటోని, బుల్లియ్య, ఆమోస్ పాల్గొన్నారు.

బల్లికురవ : వర్గీకరణ కోసం ప్రాణ త్యాగం చేసిన మాదిగలకు శనివారం ఎంఆర్‌పీఎస్ నేతలు నివాళులర్పించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ గొంతుక వినిపించేలా తమ ప్రాణాలను త్యాగం చేసిన వారిని ఎన్నటికీ మరవలేమని వారు తెలిపారు. కార్యక్రమంలో పేతూరు, సామ్యేల్, ఇజ్రాయల్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.3లక్షల విరాళం



నగదును అందజేస్తున్న భూచంద్రరావు, పక్కన శ్మశాన వాటిక కమిటీ ప్రతినిధులు సురేంద్రబాబు

పర్చూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో రూ.కోటి వ్యయంతో రూపుదిద్దుకున్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రవాశాంధ్రుడు దాతృత్వం చాటుకున్నారు. శ్మశానంలో షెడ్ నిర్మాణానికి సోమవారం రూ.3లక్షల నగదును కమిటీ నిర్వాహకులకు అందజేశారు. చల్లా వెంకటాచలం, ధర్మపత్ని కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రోజారావు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో తులసి భువనేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి నరసింహం, లగడపాటి శంకర్, శ్రీనివాసరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

చెరువులో యువకుడి గల్లంతు



యువకుడి కోసం చెరువులో గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

పర్చూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల పరిధిలోని పెదజాగర్లమూడి గ్రామ ఎస్సీకాలనీలోని చెరువులో యువకుడు గల్లంతైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. యువకుడు ఎవరు అనేది తెలియాల్సి ఉంది. చెరువులో యువకుడు మునిగిపోతున్నట్లు గుర్తించినవారు గ్రామస్థులకు సమాచారం అందించారు. విషయం తెలియడంతో పెద్ద ఎత్తున కాలనీవాసులు చెరువు వద్దకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్, పర్చూరు ఎస్‌ఐ మాల్యాద్రి సారథ్యంలో చీరాల ఫైర్ సిబ్బంది నేతృత్వంలో రెస్క్యూ టీమ్ గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చెరువు చుట్టూ భారీ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చుసి గాలింపు కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలంలో చెప్పులు వదిలి ఉండడం గమనార్హం.

టీడీపీ సీనియర్ నాయకుడు శివ మృతి

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పర్చూరుకు చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు పొన్నం శివ (62) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తెలుగు దేశం పార్టీకి శివ చేసిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్‌తో నేతలు, అధికారులు

క్రమం తప్పకుండా చెత్తను తరలించాలి

పంగులూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ పరిధిలో నిత్యం చెత్తతో కూడిన వ్యర్థాలను సేకరించి క్రమం తప్పకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు సూచించారు. సచ్ఛభారత్ నిధులతో ముప్పవరం గ్రామ పంచాయతీకి సమకూర్చిన ట్రాక్టర్‌ను ఏడుకొండలు, స్థానిక నేతలు శనివారం ప్రారంభించారు. గ్రామంలోని నివాస గృహాలు, ఇతర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను సంపదగా తీర్చిదిద్దాలన్నారు. మండలంలో ప్రధాన కూడలిగా ఉన్న ముప్పవరం గ్రామ పంచాయతీ అవసరాలను గుర్తించి స్వచ్ఛభారత్ ద్వారా వాహనం సమకూర్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రౌతు సాంబశివరావు, టీడీపీ నాయకులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, కార్యదర్శి బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ జ్వరాలు దూరం



మణికేశ్వరంలో మురుగును పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ గోపీనాథ్

అద్దంకిటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు పాటించడం వలన సీజనల్‌గా వచ్చే జ్వరాలకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ గోపీనాథ్ అన్నారు. శనివారం మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆరోగ్య కేంద్రం వద్ద, మురుగు కాలువలలో, ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వలు ఉండడాన్ని పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వలు ఉండడం వలన దోమల వ్యాప్తి పెరిగి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గున్యా, డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటి బారిన పడకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట డాక్టర్ హరికృష్ణ, మల్లిక, ఏఎన్ఎం శిరోమణి, టీడీపీ నేతలు కరిముల్లా, బడావలి, మీరావలి, ఆదినారాయణ, బలరామిరెడ్డి, సుధాకర్, మౌలాలి, పకీర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణతో మెలగాలి



సభావేదికపై మాట్లాడుతున్న యద్దనపూడి ఎంఈవో గోపి

మార్టూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువును కొనసాగించినపుడే కోరుకున్న స్థాయికి ఎదుగుతారని యద్దనపూడి ఎంఈవో చిలుకూరి గోపి అన్నారు.శనివారం మార్టూరులోని రాయల్ హైస్కూల్లో 10వతరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకను నిర్వహించారు.స్కూలు చైర్మన్ పీ రవీంద్రబాబు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఈవో గోపి విచ్చేశారు. సభావేదికపై గోపి మాట్లాడుతూ జీవితంలో 10 వతరగతిలో సాధించే మార్కులు ఉన్నత స్థాయికి చేరడానికి గీటురాయిగా ఉంటాయన్నారు. ఉన్నత చదువులు చదవటానికి విద్యార్థులు 10 వతరగతిలోనే ఒ క అవగాహనకు రావాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆయన చేతులమీదగా బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రావుల బాపయ్య,మదుబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాన

అద్దంకిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కలిగి, వాటికి బానిసలు కావొద్దని కళాశాల ప్రిన్సిపాల్ లాజరస్ బాబు అన్నారు. శనివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాలలో ఏర్పాటు చేసిన క్లబ్‌లో విద్యార్థులు, అధ్యాపకులను భాగస్వాములను చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జనల్ హెచ్‌వోడి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజకుమార్, కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తున్నాం

ఎంపీ కృష్ణప్రసాద్



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, పక్కన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, అధికారులు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని, జగన్‌రెడ్డిలా మాయ మాటలు చెప్పడం లేదని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం చీరాల పరిధిలోని జాండ్రపేట, పేరాలలో ఎంపీ కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వృద్ధులకు ఇచ్చిన మాట తప్పిందన్నారు. రూ.1000కి పింఛన్ పెంచుతున్నట్లు చెప్పిన జగన్‌రెడ్డి ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ మోసగించిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వెంటనే రూ. వెయ్యి పెంచడమే కాకుండా ప్రకటించిన తేదీ నుంచి రెండునెలల పింఛన్ అందజేసిందని తెలిపారు. అనంతరం ప్రజల సమస్యలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తదితర అధికారులతో పాటు పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



టీస్టాల్ వద్ద ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచిస్తున్న ప్రత్యేకాధికారి బాలమ్మ

పంగులూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నట్లు నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.బాలమ్మ అన్నారు. పంగులూరు, రామకూరు గ్రామాలలో సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమెతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు శనివారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సక్రమంగా అందుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. పింఛన్‌ల పంపిణీలో సిబ్బంది అలసత్వం వహించవద్దన్నారు అనంతరం పంగులూరు ప్రధాన కూడలిలో టీ దుకాణాలు, టిఫెన్ హోటల్స్‌ను సందర్శించి క్యాన్సర్ కారకాలైన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ పేపర్లు వినియోగించవద్దని సూచించారు. వీరి వెంట ఎంపీడీవో స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, శిరీష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరిధిలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చినగంజాం, కడవకుదురు, గొనసపూడి, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్న పెన్షన్ పంపిణీని ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలో 5845 మంది పెన్షన్‌దారులకు గాను 5558 మందికి పెన్షన్ పంపిణీ చేసి 96శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి సోమవారం అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

103మంది గైర్హాజర్

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 2,588 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2485 మంది మాత్రమే హాజరయ్యారు. 103 మంది గైర్హాజరయ్యా రు. చీరాల పరిధిలో విజ్ఞాన భారతి, శ్రీమేధావి, ఉమెన్స్, శ్రీ విద్యా, ఏకేపీ, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్, శ్రీ గౌతమి, వేటపాలెం పరిధిలో బండ్ల బాపయ్య కళాశాలలు పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. ఈక్రమంలో ఆయా కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

అయితే తిమ్మసముద్రంకు చెందిన విద్యార్థి హరికృష్ణ పరీక్ష రాసేందుకు చీరాల వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. స్థానికులు హరికృష్ణకు ఏరియా ఆసుపత్రిలో చికిత్సను అందించగా కేంద్రానికి ఆలస్యంగా వెళ్లాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అధికారులు పరీక్షకు అనుమతి కల్పించారు.

అద్దంకిటౌన్ : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. అద్దంకిలో శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 1,020 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 977 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ ఎం.వీరాంజనేయులు తెలిపారు.

బల్లికురవ :జూనియర్ కళాశాలలో జరిగిన మొదటి సంవత్సర ఇం టర్ పరీక్షలకు 135 మందికి గాను 20 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ రవింద్రబాబు తెలిపారు.

ఇంకొల్లు : రెండు పరీక్షా కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మొత్తం 33 మంది గైర్హాజరయ్యారు. డీఎన్‌ఎం జూనియర్ కళాశాలలో 158 మందికి గాను 144 మంది, డ్రీమ్స్ కళాశాలలో 202 మందికి గాను 183 మంది పరీక్షకు హాజరయ్యారు.

మార్టూరు : ఇంటర్ మొదటి సంవత్సరపరీక్షలు రెండు కేంద్రాలలో ప్రశాంతంగా మొదలయ్యాయి. ఆయా కేంద్రాల వద్ద నిర్వాహకులు అన్నివసతులను ఏర్పాటుచేశారు. వాటిలో మార్టూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 251 మంది విద్యార్థులకు గాను 232 మంది హాజరయ్యారు. శ్రీహర్షిణి కాలేజీలో 287 మందికి 265 మంది హాజరయ్యారు. పోలీ బందోబస్తు నిర్వహించారు.

సంతమాగులూరు : జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 153 మందికిగాను 151 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

పర్చూరు : ఇంటర్ పరీక్షలు స్థానిక బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. 10 మంది విద్యార్థులు గైర్హాజ రైనట్లు నిర్వాహకులు సునీత తెలిపారు.



చీరాల ఏకేపీ కాలేజీ వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు



అద్దంకి పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాల పరిశీలన



బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన రెవెన్యూ పరిధిలో బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని విశ్రాంత ఎంపీడీవో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం చేపడుతున్న ప్రదేశాన్ని శనివారం తహసీల్దార్ రవినాయక్ పరిశీలించారు. అర్అండ్‌బీ రోడ్డు పక్కన గతంలో ప్రభుత్వం ఎస్టీలు, జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించింది. వాటికి ముందు వైపున అర్అండ్‌బీ భూమిని ఆక్రమించుకొని పెద్దఎత్తున వ్యాపార సముదాయాలను కట్టడంపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణం చేస్తున్న భవనాలకు కొలతలు వేయగా రోడ్డు స్థలం 80 శాతం ఉండడంతో వెంటనే అర్అండ్‌బీ అధికారులకు సమాచారం అందించి నోటీసులు జారీ చేయిస్తామని తహసీల్దార్ తెలిపారు. రోడ్డుపక్కన నీరు కూడా పోకుండా కాలవను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేయడం ఏమిటని భవన యజమానిని ఆయన ప్రశ్నించారు. రెండేళ్ల కిందట కూడా దుకాణాల పనులు మొదలుపెట్టగా అప్పట్లో అధికారులు రోడ్డు భూమి అని మార్కింగ్ పెట్టగా కొంత కాలం పనులు నిలిపేసి మరలా ఇప్పుడు పకడ్బందీగా ఒక అంతస్తుతో దుకాణాలను నిర్మాణం చేస్తున్నారని పలువురు ఈసందర్భంగా ఆరోపించారు. ఈ పరిశీలనలో సర్వే డీటీ ప్రహర్ష, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ చంద్ర, పంచాయతీ కార్యదర్శి మీరావలి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షలను 3,580 మంది రాయనున్నట్లు తెలిపారు. 200 మంది ఇన్విజిలేటర్స్, 20 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 10 సిట్టింగ్ స్క్వాడ్స్, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే 8341408109కు ఫోన్ చేయాలని కోరారు.

విజయీభవ..



అర్చకుడికి హాల్‌టికెట్లు ఇచ్చి దీవెనలు అందుకుంటున్న విద్యార్థులు

● ఇదిగో ఇక్కడుంది నా నెంబర్!



పరీక్ష కేంద్రంలో గదులను పరిశీలించుకుంటున్న విద్యార్థులు



వీటికి నో ఎంట్రీ!

నెల్లూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



ఏలోటూ రానీయొద్దు

పోలీస్‌స్టేషన్ వద్ద అధికారులకు ఆర్ఐవో శ్రీనివాసులు సూచనలు

తొలిరోజు ప్రశాంతంగా..

ఇంటర్ పరీక్షల ప్రారంభం
28,098 మంది విద్యార్థుల హాజరు

టైం అయిపోతోంది.. త్వరగా బయలుదేరుదాం!
- ఇంటి వద్ద హడావుడి

పరీక్షలు బాగా రాసేలా దీవించు దేవా..
- ఆలయాల్లో విద్యార్థుల మొక్కులు

నాయనా.. టెన్షన్ పడొద్దు. కొశ్చన్ పేపరు ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకుని సమాధానాలు రాయి. టైం ఉంటే చాయిస్‌ను కూడా వదలొద్దు!
- పిల్లలకు తల్లిదండ్రుల హితబోధ

అమ్మా.. బాగా రాశానమ్మా! చదివినవన్నీ వచ్చాయి!
- పరీక్షల అనంతరం విద్యార్థుల ఆనందం

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 9 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ ద్వితీయభాష (తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ) పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు నిమిషం ఆలస్యమైన అనుమతి లేదన్న నిబంధన అమలు చేశారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాష్ట్ర కార్యాలయంతో పాటు జిల్లా కేంద్రంలోని ఆర్ఐఓ కార్యాలయం ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా అధికారులు పరిశీలించారు. తొలి రోజు కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందుగానే చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. ఉదయం 8.30 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. కేంద్రాల బయటనే హాల్‌టికెట్లు పరిశీలించిన అనంతరం విద్యార్థుల వద్ద ఉన్న ఇతర గాడ్జెట్స్‌ను లోనికి అనుమతించలేదు. తల్లిదండ్రులు మాత్రం పరీక్ష కేంద్రాల వద్దనే మూడు గంటలపాటు ఎదురు చూశారు.



ఎలా రాస్తున్నారో ఏమో!?
పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రుల్లో ఉత్కంఠ

● 914 మంది గైర్హాజరు

ఇంటర్ పరీక్షల్లో తొలిరోజున 29,102 మందికి 28,098 మంది విద్యార్థులు హాజరయ్యారు. 914 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించగా డీవీఈఓ నాలుగింటిని, డీఈసీ సభ్యులు ఏడింటిని, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 26 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని అధికారులు తెలిపారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



ఆల్ ది బెస్ట్ : సీతారామపురంలో విద్యార్థులకు సూచనలిస్తూ...



వ్యాఘ్రంపై ముక్కంటి వైభోగం

నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరుడు పులి వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఉదయం పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. అనంతరం చప్పర ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

చాంద్‌రాత్ ముబారక్

● కనిపించిన నెలవంక.. మురిసిన ముస్లింలు
● నేటి నుంచి రంజాన్ నెల



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం) : 6.19
సహరి (సోమవారం) : 5.05

నెల్లూరు (సాంస్కృతికం)/ పొదలకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ ముస్లింల పవిత్ర మాసం. శనివారం సాయంత్రం నెలవంక దర్శనంతో ప్రారంభమైంది. దీంతో నగరంలోని పలు కూడళ్లలో ముస్లింలు 'చాంద్‌రాత్ ముబారక్' అంటూ కేరింతలు కొట్టారు. ఒకరినొకరు ఆలింగనంలు చేసుకుంటూ అభినందనలు తెలుపుకున్నారు. జెండావీధి, తూకుమాన్‌మిట్ట, మహాత్మాగాంధీనగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, నవాబుపేట, తదితర సెంటర్లలో యువత బాణాసంచా పేల్చి రంజాన్ మాసానికి స్వాగతం పలికారు. నియమ నిష్టలు, క్రమశిక్షణ, దాన ధర్మాలు నిర్వహించే రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 30వ తేదీ వరకు నిర్విఘ్నంగా సాగేలా చూడమని మహమ్మద్ ప్రవక్తను తారావి ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం 5.05 గంటలకు సహరి స్వీకరించి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. సాయంత్రం 6.18గంటలకు దువా ప్రార్థనలు చేసి ఇఫ్తార్ స్వీకరించి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఇలా ప్రతిరోజు సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత వరకు ఉపవాస దీక్షలు కొనసాగిస్తారు. రంజాన్ ఉపవాస దీక్షలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, శాసనసభ్యులు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.

నటి అనుపమ సందడి



నెల్లూరు (సాంస్కృతికం) : సినీ నటి అనుపమ పరమేశ్వరన్ శనివారం నెల్లూరులో సందడి చేశారు. మినీ బైపాస్‌లో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. వారికి అనుపమ అభివాదం చేసి సెల్ఫీలు దిగారు. భారీగా అభిమానులు రావడంతో వారిని నియంత్రించేందుకు పోలీసులు లాఠీలకు పని చెప్పారు.

హెల్మెట్ ధరించకుంటే వెయ్యి..
డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు

● అమలులోకి కేంద్ర మోటారు వెహికల్ చట్టం

కొత్త జరిమానాలు	రూ.లలో
హెల్మెట్ ధరించకుంటే	1000
డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే	5000
ఇన్సూరెన్స్ లేకుంటే	
మొదటిసారి	2000
రెండవ సారి నుంచి	1500
సైలెన్సర్ మార్చితే	1500
సెల్‌ఫోన్ డ్రైవింగ్	1500
డేంజర్ డ్రైవింగ్	10,000
సీటు బెల్ట్ లేకుంటే	1000
రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్,	
రెన్యువల్ లేకుంటే	2000
రెండవసారి	10,000
ఓవర్ స్పీడ్	1000
ట్రిపిల్ రైడింగ్	1000

నెల్లూరు (క్రైం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మోటారు వెహికల్ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఇక జేబుకు చిల్లే. కేంద్రం రూపొందించిన చట్టంలోని కొత్త మార్గదర్శకాలు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. ఆ నిబంధనల ప్రకారం హెల్మెట్ ధరించకపోయినా.. సీటు బెల్టు పెట్టుకోకపోయినా.. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా వెయ్యి రూపాయలకుపైనే జరిమానా విధించనున్నారు. ఈమేరకు పోలీస్ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. రోడ్డు భద్రతా నాయమాలు అనుసరించి వాహనాలు నడుపుతూ గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ ప్రజలకు సూచించారు. లైసెన్స్, హెల్మెట్, రిజిస్ట్రేషన్, బీమా డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని, సీట్ బెల్టు ధరించడం, మద్యం తాగి వాహనాలు నడపడం చేయకూడదని పేర్కొన్నారు. కొత్త చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించేందుకు 50 శాతం రాయితీ ప్రకటించినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక కిలో వాట్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు రూ.2వేలు ఉండగా 50 శాతం రాయితీ పోను రూ.1000 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. జిల్లాలో 6,75,535 మంది గృహ వినియోగదారులు ఉన్నారని, వారిలో ఎక్కువ మంది గతంలో తక్కువ లోడ్‌తో మీటర్లు పొంది ప్రస్తుతం ఎక్కువ విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అటువంటి వారంతా క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. మార్చి 1 నుంచి జూన్ 30 వరకు స్థానిక విద్యుత్ కార్యాలయాల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఆ భూమి మాది కాదు..
అబ్బే మాదీ కాదు!

● రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల తీరిది
● అయ్యవారిపల్లి అటవీ భూముల్లో పొంతనలేని కొలతలు
● ఆక్రమణదారులకు స్వర్గధామంగా మారిన వైనం
● రూ.కోట్లు విలువైన భూముల ఆక్రమణ

కాసింత స్థలం కనిపిస్తే చాలు.. తమదంటే తమదని పోట్లాడుకునే వాళ్లను చూశాం. ప్రభుత్వ శాఖల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తుంటాయి. కానీ అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల తీరు మాత్రం విచిత్రంగా ఉంటోంది. వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లిలో విలువైన భూములు తమవి కాదంటూ తమవి కాదంటూ ఆక్రమణదారులకు స్వర్గధామంగా మార్చేస్తున్నారు. అంతేకాదండోయ్.. కబ్జారాయుళ్లు ఇచ్చే మామూళ్లకు దాసోహమై రికార్డులను తారుమారు చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. భూ కొలతలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ సాంకేతికత అభివృద్ధి చెందిన నేటికాలంలో కూడా రమారమి 6500 ఎకరాలకు హక్కుదారులే లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో వేరే చెప్పాల్సిన పనిలేదు.



అయ్యవారిపల్లి సమీపంలో ఉన్న కొండ భూములు

కందుకూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ పుణ్యక్షేత్రం చెంతనే ఉండే అయ్యవారిపల్లి పరిధిలో పలు కొండలు, గుట్టలతో కూడిన అటవీ భూములు ఉన్నాయి. అటవీ శాఖ రికార్డులు, రెవెన్యూ ఫీల్డ్ లెవల్ రిజిస్టర్ (ఎఫ్ఎల్ఆర్) ప్రకారం సర్వే నెం.4లో 72 ఎకరాలు, మరో సర్వే నెం.118లో 1584 ఎకరాల అటవీ భూమి ఉంది. అయితే ఈ రెండు సర్వే నెంబర్ల ఫీల్డ్ మెజర్‌మెంట్ మ్యాప్ బుక్ (ఎఫ్ఎంబీ)లు పరిశీలిస్తే ఎఫ్ఎల్ఆర్‌లో చూయించిన విస్తీర్ణానికి, వాస్తవ కొలతలకు పొంతనే లేదు. ఎఫ్ఎంబీ కొలతల ప్రకారం సర్వే నెం.118లో 5,603 ఎకరాలు ఉండగా, సర్వే నెం.4లో 2,552 ఎకరాల భూమి ఉంది. ఈ రెండు సర్వే నెంబర్లలో చదునుగా ఉండే భూమితోపాటు కొండలు, గుట్టలు కూడా ఉన్నాయి. ఈ రెండు సర్వే నెంబర్లను కొండలు, గుట్టలతో సహా అటవీ శాఖకు కేటాయించారు. అంటే మొత్తం భూమి 8155 ఎకరాలు ఉండగా అటవీ శాఖకు రికార్డుప్రకారం కేటాయించింది 1656 ఎకరాలు మాత్రమే. అటవీ శాఖ అధికారులు కూడా తమకు కేటాయించిన విస్తీర్ణాన్ని బట్టి 1,656 ఎకరాలకు మాత్రమే తమదని చెబుతున్నారు. దీంతో మిగిలిన 6,499 ఎకరాలకు హక్కుదారులు ఎవరనేది లేకుండా పోయింది. ఆర్ఎస్ఆర్, ఇతరత్రా భూ రికార్డులు పరిశీలించినా ఆ రెండు సర్వే నెంబర్లలో ఉన్న విస్తీర్ణం ఎఫ్ఎంబీకి అనుగుణంగా ఉండటమేగాక ఈ రెండు సర్వే నెంబర్లలో ఎలాంటి ప్రైవేటు పట్టాదారులు లేరు. సాధారణంగా ఒక సర్వే నెంబరులో కొంత భూమిని అటవీశాఖకు కేటాయించి ఆ సర్వే నెంబరులో పట్టాదారులెవరూ లేనప్పుడు మిగిలిన విస్తీర్ణం రెవిన్యూశాఖ అధీనంలో ఉండాలి. కానీ ఇక్కడ అదేమీ జరగకపోవటం ఆ రెండు సర్వేనెంబర్ల మొత్తం విస్తీర్ణం 1656 ఎకరాలు మాత్రమే అన్నట్లుగా భూరికార్డులు తయారుకావటంతో వేల ఎకరాలకు హక్కుదారులేకుండా పోయారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

ఈ భూముల్లో విలువైన ఖనిజ నిక్షేపాలు, వృక్ష సంపద ఉండటం, 167బీ జాతీయ రహదారి వెళ్తుండటంతో ఈ భూముల విలువ రూ.వందల కోట్లకు పెరిగిపోయింది. గ్రావెల్, మట్టికి కూడా మంచి డిమాండ్ ఏర్పడటంతో ఎవరి ఇష్టానుసారం వారు ఆక్రమించేస్తున్నారు. ఇటుకల బట్టీల నిర్వహణ కోసం కొందరు, మట్టి తవ్వకాల కోసం కొందరు ఈ భూములను ఆక్రమించేసి సొమ్ము చేసుకుంటున్నారు. హైవే నిర్మాణ కాంట్రాక్టరు కూడా ఈ భూముల్లోనే పెద్దఎత్తున గ్రావెల్ ఎత్తుకుని రహదారి నిర్మాణానికి వినియోగించుకున్నట్లు సమాచారం. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆక్రమణలకు తెరలేపడం, ఈ వ్యవహారంపై పలువురు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు ఫిర్యాదుచేయటంతో రెవెన్యూ, అటవీ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ఆక్రమిత భూమి ఏ శాఖకు చెందుతుందో తేల్చాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే సర్వే చేశారు కానీ ఎవరికి వారే ఆ భూమి తమది కాదంటే తమదికాదని సబ్ కలెక్టరుకు నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సర్వే సందర్భంగా ఎఫ్ఎంబీలోని కొలతకు, ఎఫ్ఎల్ఆర్‌లోని కొలతలకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన అధికారుల ద్వారా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 6,499 ఎకరాల విస్తీర్ణం వ్యత్యాసం ఉందని అర్థమవుతున్నా ఇంత భారీవ్యత్యాసంతో రికార్డులు ఎలా రూపొందాయో అర్థం కాక తలపట్టుకుంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులు దృష్టిసారించి సమగ్ర సర్వే ద్వారా భూ రికార్డులు పక్కాగా రూపొందించి వందల కోట్ల విలువైన వేల ఎకరాల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అయ్యవారిపల్లి దగ్గర నిర్మించిన అటవీశాఖ క్వార్టర్స్ చుట్టూ చిల్లచెట్లు పెరిగిపోయి శిథిలావస్థితికి చేరుతున్న దృశ్యం

సర్వేచేసి హద్దులు నిర్ణయించాలి

అయ్యవారిపల్లి రెవెన్యూలో సర్వే నెంబర్లు 118, 4లలో ఉన్న భూ సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ సర్వే నెంబర్లలో కొంత భూమి అటవీ శాఖకు కేటాయించి ఉండగా మిగిలినది రెవెన్యూ భూమిగా ఉంది. అయితే ఎవరి భూమి ఎక్కడివరకు అనే విషయంలో స్పష్టత లేదు. జాయింట్ సర్వేచేసి హద్దులు నిర్ణయిస్తే మొత్తం విస్తీర్ణం ఎంత, అటవీశాఖకు పోను రెవెన్యూ శాఖకు మిగులుతుంతో తేలిపోతుంది. రికార్డులు లోతుగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- అబ్దుల్ హమీద్, తహసీల్దారు, వలేటివారిపాలెం

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ. 5,02,157

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 5,02,157 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,050, కుంకుమార్చన ద్వారా రూ. 19,040, వివాహాల ద్వారా రూ. 2 వేలు, తలనీలాల ద్వారా రూ. 22,675, వాహనపూజల ద్వారా రూ. 1,800, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,57,800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 600, రూముఅద్దెల ద్వారా రూ. 30,990, కవర్ల ద్వారా రూ. 4,500, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,64,290, అన్నదానం ద్వారా రూ. 91,412, ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

నెలాఖరు వరకు గాలికుంటు టీకాలు

కందుకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ నెలాఖరు వరకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టరు ఎస్. సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మాచవరం, కోవూరు గ్రామాల్లో టీకాల కార్యక్రమం పూర్తిచేశామని తెలిపారు. ఈనెల 19 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని, 20నుంచి నెలాఖరు వరకు కందుకూరులోని అన్ని వార్డులలో టీకాల కార్యక్రమం కొనసాగిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కందుకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దనకాలనీ 11కేవీ సబ్‌స్టేషన్ నుంచి కోవూరు ఫీడర్, ఉప్పుచెరువు ఫీడర్లలో లైన్‌వర్క్ ఉన్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు ఫీడర్ పరిధిలోని కోవూరు, నరిశెట్టివారిపాలెం, జిల్లెలమూడి, పందలపాడు, విక్కిరాలపేట గ్రామాలకు, ఉప్పుచెరువు ఫీడర్ పరిధిలోని మగ్గాలమిల్లు ఏరియా, ఉప్పుచెరువు కాలనీ, ఏకలవ్యనగర్, బృందావనం, మాయాబజారు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

బహుమతుల పంపిణీ

కందుకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వారం రోజులుగా నిర్వహించిన కేపీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొనగా, శనివారం జరిగిన ఫైనల్స్‌లో ఒంగోలు జట్టు విజేతగా నిలవగా, సింగరాయకొండ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా సింగరాయకొండ జట్టుకు చెందిన హరీష్, అదే జట్టులోని రసూల్ బెస్ట్ బౌలర్‌గా స్థానాలు దక్కించుకున్నారు. ఒంగోలు జట్టులోని బాలాజీ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను కైవసం చేసుకున్నారు. విజేత జట్టుకు రూ. లక్ష,రన్నరప్ జట్టుకు రూ. 50వేలు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టరు నవీన్‌కుమార్, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 95 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కే. శ్రీనివాసులు చెప్పారు.శనివారం ఆయన లింగసముద్రంలో కొంతమంది లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు.మిగిలిన ఐదు శాతం మంది లబ్ధిదారులకు ఆది, సోమవారాల్లో అందజేస్తామని చెప్పారు.

ఇళ్లలోని వ్యర్థాలతో సంపద తయారీ

బిట్రగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్ద సేకరించే వ్యర్థాలతో కూడా సంపద తయారు చేయవచ్చని ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్ వివరించారు. బోగోలు లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శనివారం మండలంలోని అన్నీ పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తడి వ్యర్థాలను కంపోస్టు ఎరువుగా ఎలా తయారు చేయవచ్చో ఆయన వివరించారు. పచ్చదనంతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి అబ్దుల్ జహీర్, రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

బాడన్‌పేటలో నవోదయం 2.0

బిట్రగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప బాడన్‌పేటలో శనివారం సాయంత్రం కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ డీసీ టీ.శ్రీనివాసరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులు నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకాల వలన జరిగే పరిణామాలు, నష్టాలను వివరించారు.ఎక్కడైనా సారీ తయారీ, అమ్మకాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆకుల డేవిడ్‌పాల్, మేకల సాల్మన్‌రాజ్, ఆవుల నాగేశ్వరావు, నెల్లూరు ఏసీ జే.రమేష్, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కిశోర్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్సు మూఢనమ్మకాలను దూరం చేస్తుంది

ఉలవపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ మూఢనమ్మకాలను దూరం చేస్తుందని భీమవరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం. బండి సుబ్బారావు అన్నారు. శనివారం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు, ఉపకరణాల ప్రదర్శన నిర్వహించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ ఉపాధ్యాయులు మేడికొండ భాస్కర్, మాలకొండ ప్రసాద్, అనూక్ అభిషేక్, చిట్టిబాబు, శ్రీధర్ మస్తాన్ వలి, హేమలత మాట్లాడుతూ సైన్స్ ప్రత్యేకత గురించి విద్యార్థులకు తెలిపారు.

వంతెన మరమ్మతులు సరే..

- మెట్ల దారికి మోక్షమెప్పుడో..!?
- ధ్వంసమైన గోడలతో ప్రజల అవస్థలు

కావలి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెనపై రోడ్డు మార్గంలో మరమ్మతులు చేపట్టారు. కానీ ఆ వంతెనకు రైల్వే రైల్వే లైన్‌కు పడమర వైపున ఉన్న మెట్ల దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలిపోయేలా ఉంది. దానికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కావలి-ఉదయగిరి జాతీయ రహదారిని ఆ వంతెన మీదుగా మద్దూరుపాడు బైపాస్ వద్ద ప్రధాన జాతీయ రహదారికి కలపనున్నారు. అందులో భాగంగా వంతెన పైభాగాన దెబ్బతిన్న మార్గానికి శాశ్వత మరమ్మతులు చేపట్టి అదనంగా తారు రోడ్డు వేస్తూ రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేస్తున్నారు. అంతవరకు అందరూ దానిని



అభినందిస్తున్నారు. కానీ ఆ వంతెనపైకి రాకపోకలు సాగించేందుకు రైల్వే ట్రాక్‌కు పడమర వైపున ఏర్పాటు చేసిన మెట్ల దారి పూర్తిగా శిథిలా వస్థకు చేరుకుంది. దాని చేపట్టు గోడలు ఇప్పటికే కూలి పడిపోయాయి. దీంతో ఆ మెట్ల దారిని రాకపోకలు సాగించాలంటే పాదాచారులు ఎక్కడ ప్రమాదాలకు గురవుతారోనని ఆందోళన చెందుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేస్తున్న జాతీయ రహదారి అధికారులు ఆ మెట్ల దారికి కూడా మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరుగకుండా చూడాలని పాదాచారులు కోరుతున్నారు.

దెబ్బతిన్న ఆర్వోబీ మెట్ల మార్గం

శిథిలమవుతున్న లక్ష్యం!

- నిరుపయోగంగా చెత్తతో సంపద కేంద్రాలు

వలేటివారిపాలెం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వాహణతో పాటు ఆర్థిక వనరులు మెరుగుపరచాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం హయంలో నిర్మించిన చెత్తతో సంపద కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మండలంలోని అయ్యవారిపల్లె, అంకభూపాలపురం, నలదలపూరు, బడేవారిపాలెం పంచాయతీల్లో మినహా మిగిలిన 17 పంచాయతీల్లో చెత్తతో సంపద కేంద్రాలు నిర్మించారు. అయితే ఎక్కడా ఇవి పనిచేయడం లేదు. ఈ కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారాయి. కాగా మూడో శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఎక్కడ చూసినా ఫొటోల కార్యక్రమంగా మారింది.



వలేటివారిపాలెంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



చెత్త సంపద కేంద్రం వద్ద తగలబెట్టిన చెత్త

మొక్కుబడిగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. చెత్త సేకరణను కాలక్షేపంగా మార్చారు. మండల కేంద్రంలో మొక్కుబడిగా ర్యాలీ చేస్తుండగా గ్రామాల్లో అయితే సచివాలయ సిబ్బంది మ.మ అనిపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రతి మూడో శనివారం ప్రత్యేక పారిశుధ్య నివారణా కార్యక్రమాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కావ్య

కావలి రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం గౌరవరంలో శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధాన్యం అమ్మకాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సత్వర పరిష్కారం కోసం స్థానిక టీడీపీ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించకుండా, నట్టేట ముంచిందన్నారు. మనీ స్కీంలాగా కాకినాడ, మచిలీపట్నంలో మిల్లర్లు ధాన్యం తోలించుకుని నగదు ఇవ్వకుండా మోసగించారని, దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మకాలు చేయాలని రైతులకు సూచించారు.మండలం లోని గౌరవరం, ఆముదాలదిన్నె, అన్నగారిపాలెం- 1, చెంచుగానిపాలెం, తాళ్లపాలెం, తుమ్మలపెంట, చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం, ఆనెమడుగు, సర్వాయపాలెం, రుద్రకోట, చలంచర్ల, కొత్తపల్లి, సిరిపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఏడీఏ నాగరాజు, ఏవో లలిత, పంచాయతీ కార్యదర్శి అఖిల, స్థానిక నాయకులు సూరె శ్రీనివాసులు రెడ్డి, చింతం బాబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

- ఫొటోలు తీపి గుర్తుగా నిలుస్తాయి

కావలి, (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ వృత్తి చాలా విలువైనదని, వారు తీసే ఫొటోలు జీవితంలో తీపి గుర్తులుగా మిగులుతాయని ఎమ్మెల్యే కావ్య వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన సంద్ర ప్రసాద్ ప్యానల్ శనివారం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలశారు. ఆయన ప్యానల్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలిని కనకపట్నంగా చేయటంలో మీ అసోసియేషన్ కూడా భాగస్వాములను చేసుకుని, ముందుకు పోతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడు వీ. హనోక్‌పాల్, కార్యదర్శి చిలకపాటి మనోహర్, కోశాధికారి పులిశెట్టి మల్లిక్, సంయుక్త కార్యదర్శులు పిల్ల చంద్ర, చిత్రకళ మాలి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

అల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. మాడభూషి కృష్ణమాచారి మెమోరియల్ ట్రస్ట్ (హైదరాబాద్) 107 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయలు శ్రీధర్‌రావు, సుబ్బారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- కొండాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటలో దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లైఫ్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. ఐ.బాలక్రిష్ణయ్య, జీ.అనుసూయమ్మ, గంటా అరుణ, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : విద్యార్థికి పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు



కొండాపురం : విద్యార్థినికి పరీక్ష సామగ్రి అందచేస్తున్న హెచ్‌ఎం బాలక్రిష్ణయ్య తదితరులు

అమరవీరుల సంస్మరణ దినం

కొండాపురం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో అమరులైన మాదిగలకు శనివారం మండలంలోని సాయిపేటలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంస్మరణ దినం నిర్వహించారు. సీనియర్ నాయకుడు మందా నాగేశ్వరరావు మాట్లాడుతూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు ముందుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నలగట్ల ఆశీర్వాదం, కొప్పర్తి సురేష్, కే. ఆంథోనిబాబు, కే.కిషోర్, ఎర్మియా, మధు తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం : మాట్లాడుతున్న మందా నాగేశ్వరరావు

- లింగసముద్రంలో

లింగసముద్రం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మాదిగ జాతివీరులకు ఎమ్మార్పీఎస్ నేతలు నివాళి అర్పించారు. శనివారం జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాదిగ మండలంలోని శింగరపాలెం, జంపాలవారిపాలెం గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా అమరులైన మాదిగ జాతిబిడ్డలకు సంతాపం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎడ్ల డేవిడ్, అవినాష్, కూచిపూడి చింటు, బుంగ వంశీ, ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

నాడీ వ్యవస్థపై అవగాహన

బిట్రగుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలలోని ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడీ వ్యవస్థపై నెల్లూరుకి చెందిన ప్రముఖ వైద్యురాలు బిందుమీనన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీఎస్.రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, అన్నీ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బిందుమీనన్

నలుగురికి ఒక్కరే రేడియాలజిస్ట్

- కావలి ఏరియా ఆసుపత్రిలో అత్యవసర వైద్యసేవలు అందేదెలా?

కావలి,మార్చి1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా వైద్యశాలలో నలుగురికిగాను ఒక్కరే రేడియాలజిస్ట్ ఉన్నారు. దీంతో ప్రమాదాల బారిన పడినవారికి అత్యవసర వైద్యసేవలు ఎలా అందుతాయని వైద్యశాల వర్గాలు చర్చించుకుంటున్నాయి. 24 గంటలు అందుబాటులో ఉండే కావలి ఏరియా వైద్యశాల స్థాయికి వాస్తవంగా ఆరుగురు రేడియాలజిస్ట్‌లు ఉండాలి. అయితే ప్రస్తుతం వైద్యశాలలో నాలుగు పోస్టులు మాత్రమే ఉన్నాయి. వారిలో మొన్నటి వరకు ముగ్గురు రేడియాలజిస్ట్‌లు ఉండగా వారిలో ఇద్దరు బదిలీపై వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఒకే ఒక రేడియాలజిస్ట్ ఉండటంతో అత్యవసరసేవలు ఇబ్బందికరంగా ఉన్నాయి. కావలి ఏరియా వైద్యశాల జాతీయరహదారి వెంబడి ఉండటంతో రహదారిపై ప్రదాలు జరిగినవారు కావలి ఏరియా వైద్యశాలకు వస్తారు. అలాగే ఉదయగిరి మార్గంలో కూడా వింజమూరు వరకు రోడ్డు ప్రమాద బాధితులు కావలి ఏరియా వైద్యశాలకు వస్తారు. ఒక సమయం అంటూ లేకుండా 24 గంటల్లో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో తెలియని పరిస్తితి. ఈ పరిస్థితిలో క్షతగాత్రులు కావలి ఏరియా వైద్యశాలకు వచ్చినప్పుడు వారికి జరిగిన ప్రమాదాల తీవ్రతను తెలుసుకునేందుకు ఎక్స్‌రేలు తీస్తే కానీ తెలియదు. అయితే ఒకే రేడియాలజిస్ట్ ఉండడంతో ఆయన విధులు ముగించుకుని వెళ్లిన సమయంలో బాధితులు వస్తే ఏమి చేయాలో తెలియక వైద్యులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక వేళ ఆయన సెలవు పెట్టినా, ఆదివారం లాంటి సెలవుదినాలలో, ఆయన విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన సమయంలో ప్రమాద బాధితులు వస్తే వారికి వైద్యసేవలు అందించేందుకు ఎక్స్‌రేలు ఎవరు తీయాలి అనేది పెద్ద సమస్యగా తయారైంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డివిజన్ కేంద్రమైన కావలి ఏరియా వైద్యశాల అవసరాలకు తగినట్లుగా రేడియాలజిస్ట్‌లను నియమించి ప్రజలకు సరైన వైద్యసేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఏరియా వైద్యశాలలోని ఎక్స్‌రే రూము

క్రాకుటూరు హైస్కూల్‌లో సరస్వతీ పూజ

కలిగిరి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రాకుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష సామగ్రిని అమ్మవారి ఎదుట ఉంచి పూజలు నిర్వహించారు. గ్రామంలోని పీఎంకే ఎస్‌కే హజరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు దగ్గరపడుతున్నవేళ విద్యార్థులు కష్టపడి చదివి, మంచి మార్కులు తెచ్చుకోవాలని తెలిపారు. పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందించడంతోపాటు ఉపాధ్యాయు లకు, విద్యార్థులకు శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయభారతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రాకుటూరు హైస్కూల్‌లో జరిగిన సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గాలి, వెలుతురు లేక ఇంటర్ విద్యార్థుల అవస్థలు

కావలిటౌన్, మార్చి1(ఆంధ్రజ్యోతి)ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆర్‌ఐవో పర్యవేక్షణలో జరిగి పరీక్షల్లో ఐదుకేంద్రాల్లో కలిపి 2,206 మంది పరీక్షలు రాయాల్సివుండగా 2,106మంది రాశారు. కొన్ని కేంద్రాల్లో ఇరుకు గదులు, సరైన గాలి, వెలుతురు లేక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసు

భ్రూణ హత్యలు నిర్మూలించాలి

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యలను నిర్మూలించడం కోసమే కేంద్రం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కాకుటూరు లో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు అనంతరం ఫ్లెక్సీలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు

కుంటల ప్రయోజనంపై అవగాహన కల్పించాలి

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) కుంటల ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధి హామీ ఏపీడీ బాబూరావు తెలిపారు. మండలంలోని కొండసముద్రం, నూకవరం, పోకూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో ఉమామహేష్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ కూలీలకు సరాసరి వేతనం రూ.300 లభించేలా కొలతలపై అవగాహన కల్పించారు. ప్రతి పంచాయతీకి 25 రైతువారీ కుంటలకు తగ్గకుండా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏలు అశోక్, నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుబ్బారాయుడు, హరిబాబు ఉన్నారు.



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీడీ బాబూరావు

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవం

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని హైస్కూల్‌లో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం హెచ్‌ఎం కమల్‌కుమార్ జరిగిన కార్యక్రమంలో చుండి మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వరు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.



సరస్వతీ పూజ చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

లక్ష్మీ నృసింహుడి సేవలో విజయనగరం ఎంపీ

వలేటివారిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామిని శనివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి శాలువా,పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాని హర్షకుమార్, తదితరులు ఉన్నారు.



దర్శనానంతరం అనుచరులతో విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

ఆగిన ఆధార్ సేవలు

- మరమ్మతులకు గురైన ప్రింటర్
- 10 రోజులుగా ప్రజలకు తప్పని ఇబ్బందులు

లింగసముద్రం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని ఆధార్ సేవలు 10 రోజులుగా నిలిచిపోయాయి. ప్రింటర్ మరమ్మతులకు గురవడంతో ప్రజలు ఆధార్ సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఆధార్‌కార్డులు తీసుకొనే వారు, ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలన్నా ఇంకా ఇతర సేవలు పొందాలన్నా ఈ సచివాలయం పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పలువురు నానా అగచాట్లు పడుతున్నారు. లింగసముద్రం, ఎర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, పెంట్రాల, గంగపాలెం, ఆర్‌ఆర్ పాలెం, మొగిలిచెర్ల, వీఆర్ కోట తదితర గ్రామాల ప్రజలు మండలంలోని చినపవని, వలేటివారిపాలెంలోని ఆధార్ కేంద్రాలకు వెళుతున్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లింగసముద్రం-1 సచివాలయంలో మరమ్మతులకు గురైన ఆధార్ ప్రింటర్

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు : తహసీల్దార్

కావలి, మార్చి1(ఆంధ్రజ్యోతి) రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కావలి మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రేషన్ బియ్యం ప్రతి కార్డుదారుడికి అందాలని, అలా అందకుండా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వర్షికైనా బియ్యం చాలడం లేదని ముందుగా చెబితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 10 శాతం అదనంగా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీటీ విజయమ్మ, గోదాము ఇన్‌చార్జి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వానరానికి సపర్యలు చేస్తున్న నారాయణమ్మ

వానరానికి గాయం.. తల్లిలా సపర్యలు



కుక్కల దాడిలో గాయపడిన వానరం

కలిగిరి జడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడపై రోజూ ఓ కోతి వచ్చి కూర్చుంటుండేది. పదేళ్లుగా అక్కడే తోపుడు బండిపై తిను బండారాలు అమ్ముకుంటున్న నారాయణమ్మ ఆ వానరానికి రోజూ ఏదో ఒకటి పెడ్తుండేది. విద్యార్థులు కూడా తినుబండరాలు పెట్టేవాళ్లు. ఈ క్రమంలో శనివారం ఆమె ఇంటి వద్ద నుంచి స్కూలు వద్ద వచ్చేసరికి కుక్కలగుంపు ఆ వానరంపై దాడి చేశాయి. దీంతో అది తీవ్రంగా గాయపడింది. రక్తగాయాలతో ఉన్న ఆ వానరాన్ని చూసి నారాయణమ్మ మనస్సు తల్లడి ల్లింది. వెంటనే దాన్ని తోపుడుబండిపై స్థానిక పశువైద్యశాలకు తరలించింది. వైద్యాధికారి పరీక్షించి యాంటిసెప్టిక్ ఇంజక్షన్ వేసి, గాయాలు తగ్గడానికి మందులు ఇచ్చారు. దీంతో ఆ వానరం కొద్దిగా కోలుకుంది.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

మహిళా దినోత్సవ వారోత్సవాలు ప్రారంభం

● 8 వరకు ప్రత్యేక కార్యక్రమాలు : ఏఎస్పీ

నెల్లూరు(క్రైం), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025 వారోత్సవాలు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొదలయ్యాయి. వీటిని శనివారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఉన్న ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ప్రారంభించారు. వైద్య శిబిరం, ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, విద్య, ఉద్యోగం, పారిశ్రా మిక రంగాల్లో మహిళలు ముందుకు రావడం ద్వారా సమాజం మరింత పురోగమిస్తుందని చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేది వరకు మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యత కు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే ప్రచారాలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, పరికరాల పనితీరు, పోలీసు శాఖకు సంబంధించిన పలు విషయాలపై బాలబాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సింధుప్రియ, చంద్రమోహన్, సీఐ నాగేశ్వరమ్మ, నారాయణ వైద్యశాల డాక్టర్ డాక్టర్ మధులేఖ, గులాబీ, దీప్తి, హిమ అనురాగ్, ప్రఖ్య, ప్రసన్న, మంజు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నగర డీఎస్పీ సింధుప్రియ



ఓపెన్ హౌస్‌ను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ సౌజన్య

తక్కువ ధరలకే నుడా ప్లాట్లు

● కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్ , నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నుడా పరిధిలోని అన్నీ నియోజక వర్గాల్లో ఎంఐజీ లేఅవుట్లు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలతో ప్రజలకు తక్కువ ధరలకే ఇళ్ల ప్లాట్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. నుడాకు సంబంధించిన ప్రత్యేక సమావేశాన్ని శనివారం నుడా కార్యాలయంలో వారు నిర్వహించారు. నుడాకు సిబ్బంది, లేఅవుట్ల అభివృద్ధి, బడ్జెట్ కేటాయింపు తదితర అంశాలపై నుడా వీసీ సూర్యతేజ, అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ నుడా పరిధిలో ప్రత్యేకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కోటంరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరంతో పాటు మున్సిపాలిటీలు, పంచాయతీలలో ఎంఐజీ లేఅవుట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అక్రమ లేఅవుట్లలో ఎవరూ ప్లాట్లు కొనొద్దని సూచించారు. ప్రభుత్వ భూముల్లోనూ కొందరు లేఅవుట్లు వేశారని, వాటన్నింటిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. నెల్లూరు ప్రత్యేకతను చాటుతూ నెల్లూరు సెల్ఫీ బోర్డులను కలెక్టర్ కార్యాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నగరంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, దుకాణాలు, పాఠశాలలు, కళా శాలల వద్ద ఐలవ్‌యూ నెల్లూరు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలు దేశ నాయక్, గంగాధర్, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఆర్డీవో వంశీకృష్ణ, నుడా సెక్రటరీ పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖహాజరు తప్పనిసరి!

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకురాలు పద్మావతి

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా ముఖహాజరు (ఎఫ్ఆర్ఎస్) వేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకురాలు డాక్టర్ పద్మావతి స్పష్టం చేశారు. శనివారం నెల్లూరుకు వచ్చిన ఆమె జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అధికారులు, సిబ్బందితో వేర్వేరుగా సమీక్షించారు. విధులకు సక్రమంగా హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఫైలు ఈ ఆఫీసు ప్రక్రియ ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపీ, ఐపీలతోపాటు ప్రసవాలు, ల్యాబ్ పరీక్షలు ఐయూడీసీల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గ్రేడింగ్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పీ, డీ గ్రేడ్‌లు వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రేడింగ్‌లు మెరుగు పడేలా ప్రోగ్రాం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కాలం చెల్లుతున్న మందులను అవసరమైన పీహెచ్‌సీలకు పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో సుజాత, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డీఐవో ఉమామహేశ్వరి, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

● ఏపీ రైతు సంఘాల డిమాండ్

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, గురునాథం డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం లేక రోడ్లపైనే రాశులుగా పోసుకుంటున్నారన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాలకు వెళితే అక్కడి అధికారులు మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ రాలేదని, తేమ కొలిచే మిషన్లు చెడిపోయాయని, గోతాలు అందుబాటులో లేవని... సాకులు చెప్పి పంపించేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు పొట్టేపాళెం చంద్రమౌళి పాల్గొన్నారు.

చిత్రకళలో దిట్ట బాలకృష్ణ

● శ్రీకృష్ణుడి బొమ్మలు గీయడంలో అందవేసిన చేయి

● ప్రత్యేక శైలితో బహురూపాల చిత్రాలు సృష్టి

● ఎన్నో ప్రదర్శనలు, ప్రశంసలు

శ్రీకృష్ణుడి బహురూప చిత్రాలు వేయడంలో చిత్రకారుడు బాలకృష్ణది ప్రత్యేక శైలి. ఆయన వేసిన శ్రీకృష్ణుడి చిత్రం చూసారంటే వెంటనే కొనుగోలు చేయాల్సిందే. ఆయన పుట్టింది నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని అల్లీపురం. గ్రామంలోని మద్దెల హరికోటేశ్వరరావు, తులసిలక్ష్మీ దంపతులకు ఆయన జన్మించారు. ఎంఏ పూర్తి చేసుకుని విశ్వం ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు చిత్రలేఖనంపై ఆసక్తి ఉండడంతో ప్రవృత్తిగా కొనసాగిస్తున్నారు. చిత్రలేఖనాన్ని స్వయంగా నేర్చుకుని ఏపీ ప్రభుత్వం నిర్వహించే డ్రాయింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. మెరుగైన చిత్రాలు వేయాలన్న ఆకాంక్షతో అమీర్ ఆర్ట్ అకాడమీ అధినేత డాక్టర్ అమీర్‌జాన్ వద్ద కాన్వాస్ పెయింటింగ్‌లో శిక్షణ పొందారు. విద్యార్థులకు మంచి గురువుగానే కాక, తమ విద్యార్థులకు చిత్రలేఖనం పట్ల ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇప్పిస్తున్నారు.



కేరళలోని వాయనాడులో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో అవార్డు అందుకుంటున్న బాలకృష్ణ (ఫైల్)

● పలుచోట్ల ప్రదర్శనలు

బాలకృష్ణ వేసిన చిత్రాలను దక్షిణ భారత దేశంలో జరిగిన పలు చిత్ర ప్రదర్శనల్లో ప్రదర్శించారు. 2024 నవంబరులో కేరళ రాష్ట్రంలోని వాయనాడులో తన చిత్రాలను దక్షిణ భారత ఆర్ట్ క్యాంపులో ప్రదర్శించి ప్రశంసాపత్రం అందుకు న్నారు. ఈ ఏడాది జనవరి 18న నెల్లూరు వర్ధమాన సమాజంలో జరిగిన నెల్లూరు కలర్స్ చిత్రకళా ప్రదర్శనలో బాలకృష్ణ వేసిన కృష్ణుడి చిత్రాలు ఎక్కువగా అమ్ముడుపోయాయి. అందరి చేత ప్రశంసలు పొందారు. వచ్చే ఏప్రిల్ 4, 5, 6తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌కు ఆయన శ్రీకృష్ణుడి చిత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. చిత్రకళను ప్రచారంచేయడంతోపాటు అంతరించిపోతున్న ఈ కళకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నానని బాలకృష్ణ తెలిపారు.



చిత్రాలకు రూపురేఖలు దిద్దుతున్న బాలకృష్ణ

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

నార్త్‌రాజుపాళెం జడ్పీ పాఠశాలకు జాతీయ అవార్డు



ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం ఓబులేష్

నెల్లూరు(విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కొడవలూరు మండలంలోని నార్త్‌రాజుపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయి గ్రీన్‌స్కూల్ అవార్డు దక్కింది. న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్ ఆడిట్‌లో ఈ పాఠశాలను ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా ఐదు శాతం పాఠశాలలు మాత్రమే పర్యావరణహిత కార్యక్రమాల ద్వారా ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. ఈ క్రమంలో డిల్లీలో జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్, పాఠశాల ఉపాధ్యాయుడు కే భక్తవత్సల బాబు అవార్డు, సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన వార్షికోత్సవంలో జీఎస్పీ ఆడిట్ లో పాల్గొన్న 8వతరగతి విద్యార్థులకు, సహకారం అందించిన ఉపాధ్యాయు లకు హెచ్ఎం డీ ఓబులేష్ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీఏలు ఇప్పించండి సార్!

● గత నెలలో అంగన్‌వాడీలకు శిక్షణ

● వారం గడిచినా అందని రవాణా భత్యం

● రూ.8.69 లక్షల నిధులపై నీలినీడలు

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల కేంద్రాల్లో వినూత్న రీతిలో బోధించేందుకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్వశిక్షా అభియాన్ సారథ్యంలో శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సుమారు 2,934 మెయిన్, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 2,899 మంది కార్యకర్తలు విధులు నిర్వహిస్తు న్నారు. జ్ఞానజ్యోతి పేరుతో వీరికి ఫిబ్రవరి 18, 19, 20, రెండో విడతగా అదేనెల 22, 24, 25వ తేదీల్లో శిక్షణ ఇచ్చారు. ఆరు రోజుల శిక్షణ కాలంలో ఒక్కో కార్యకర్తకు రోజుకు రూ.50 రవాణా భత్యం (టీఏ) చెల్లించడంతోపాటు భోజనం, స్నాక్స్ అందజేయాలి. శిక్షణ కాలంలో కొందరు తొలిరోజు భోజనానికి ఎగనామం పెట్టారు. తరువాత రోజు నుంచి భోజనం, స్నాక్స్, టీ అందజేశారు. శిక్షణ చివరి రోజున కార్యకర్తలతో అక్విటెన్స్ సంతకాలు తీసుకొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లేదా సీఆర్ఎంటీల ద్వారా టీఏ నగదు పంపుతామని సూచించారు. అయితే రోజులు గడుస్తున్నా నగదు అందించకపోవడంతో కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ కేటాయింపు ఇలా..

జిల్లాలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం సుమారు రూ.49.22 లక్షలు కేటాయించింది. శిక్షణ కాలంలో ఒక్కో రోజుకు రూ.50 వంతున ఆరు రోజులకు రూ.300 ప్రకారం 2,899 మంది కార్యకర్తలు రూ.8.69 లక్షలు, భోజనం, స్నాక్స్ కోసం రోజుకు రూ.200 ప్రకారం ఆరు రోజులకు రూ.34.74 లక్షలు, స్టేషనరీ, జెరాక్స్ కోసం రూ.200 చొప్పున రూ.5.79 లక్షలు కేటా యించారు. అయితే శిక్షణ ముగిసి రోజులు గడు స్తున్నా రవాణా భత్యం అందకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలో కూడా అంగన్‌వాడీ కార్య కర్తలకు టీఏ, డీఏలు ఎగ నామం పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రవాణా భత్యం అందేలా చూడాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

60 శాతం నిధులు చెల్లించాం

'జ్ఞానజ్యోతి' శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే 60 శాతం నిధులు చెల్లించాం. రవాణా భత్యం ఎంతవోలే అందజేయాలి. కార్యక్రమానికి సంబంధించిన యూసీలు అందజేస్తే మిగిలిన 40 శాతం నిధులు కూడా అందజేస్తాం.

- వెంకటసుబ్బయ్య, ఎస్ఎస్ఏ, ఏపీసీ



ఉదయగిరిలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న విద్యా శాఖ, ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాలకుఅన్యాయం

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిం దని రాష్ట్ర వెనుకబడిన ప్రాంతాల అభి వృద్ధి వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మాదాల శ్యాంప్రసాద్ అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలే ఖరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ దశాబ్దాల క్రితం ప్రారంభమైన ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు కేటాయించక పోవడం వెనుకబడిన ప్రాంతాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష వైఖరి తెలుస్తోందన్నారు. వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులైన వెలుగొండ, సోమశిల హైలెవల్ కెనాల్‌కు కనీస నిధులు కేటాయించి బడ్జెట్‌లో అవసరమైన సరవణలు చేయాలన్నారు. అలా చేయకపోతే వేదిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణయ్య, సామాజిక విశ్లేషకులు బసిరెడ్డి మాలకొండయ్య, రైతు పోరాటయోధ నాయకులు ఆదినారాయణ, చిరంజీవి, రాఘవ, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో వేలం పాటలు

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలోని శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో శనివారం దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ హక్కులు పొందేందుకు బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయానికి సంబంధించిన దుకాణాలకు మూడు సంవత్సరాల కాలపరిమితికి అద్దె ఇచ్చుటకు బహిరంగ వేలంపాట నిర్వహించగా రూ.4,56,700కు పాటపాడి దక్కించుకున్నారు. అలాగే కొబ్బరిచిప్పలు విక్రయించేందుకు కొప్పవరపు సుబ్రహ్మణ్యం రూ.5,85,000కు పాట పాడి దక్కించుకున్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన వేలంపాటలు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమల్లేశ్వరస్వామి, శ్రీవెంగమాంబ ఆలయాల ఈవోలు కవిత, ఉషశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి ఎస్సీ కాలనీలో శని వారం డిప్యూటీ తహసీల్దారు షాజియా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు కల్పించే హక్కు లపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్విని యోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. పిల్లలను పనులకు పంపకుండా బాగా చదివించాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

సదరం ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

ఉదయగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో జరుగుతున్న దివ్యాంగుల సదరం ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం ఈనెల 8వ తేదీ వరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీవో అప్పాజీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్య పింఛన్లు, సదరం నవీకరణ మరియు డిజిటలైజేషన్ పూర్తిచేయనున్న దృష్ట్యా వాయిదా వేసినట్లు, మార్చి రెండో వారంలో పరిశీలన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి మిల్లుల అనుసంధానం

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

సంగం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను అనుసంధానం చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. శనివారం ఆయన సంగం సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉన్నారా, లేదా పరిశీలించారు. గోనె సంచులు అందుబాటులో లేకపోవడంతో అక్కడే ఉన్న సివిల్ సప్లయిస్ డీఎం, డీఎస్‌వోలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనకపోవడంతో వెంటనే ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం అర్జునరావు, డీఎస్‌వో అంకయ్య, అగ్రికల్చర్ జేడీ సత్యవాణి, తహసీల్దారు సోమ్లా నాయక్, ఏవో శ్రీహరి, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు బోణీ

జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో సంగం ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం కంతాబత్తిన వినోద్, శ్రీహరి అనే రైతుల నుంచి 190 బస్తాల ధాన్యం కొనుగోలు చేయడంతో జిల్లాలో బోణీ జరిగినట్లయింది. ఈనెల 22వ తేదీన సంగంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ శనివారం వరకు ధాన్యం కొనుగోలు కేంద్రానికి గోనె సంచులు రాలేదు. అయితే జాయింట్ కలెక్టర్ రాకతో అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతుకు మిల్లు నుంచి గోనె సంచులు తెప్పించి ఇచ్చి ధాన్యం కొనుగోలు చేశారు. జేసీ రాకతో ధాన్యం కొనుగోలుకు అడుగు పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

4న వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సంహపురి యూనివర్శిలో ఈనెల 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ, ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయి మెంట్, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షకు ఏడుగురి గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహ పురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం జరిగిన డిగ్రీ రెండవ, ఐదవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 177 మంది విద్యార్థులకు 170 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

ఆక్వా సర్వీసులపై విజిలెన్స్ దాడులు

● విద్యుత్ అక్రమ వినియోగంపై కేసులు

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : కావలి రూరల్ మండలంలో ఆక్వా విద్యుత్ సర్వీస్‌లపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వ హించినట్లు విజిలెన్స్ ఈఈ సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిని గుర్తించామన్నారు. ఆరుగురు ఆక్వా సాగుదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండడంతో వారిపై కేసులు నమోదు చేసి రూ.4 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఆకస్మిక దాడులు నిరంతరం కొనసాగుతుంటాయని, విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	111
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8178
వెండి కిలో ధర	రూ. 96,400
వెండి ఒక గ్రాము	రూ.99.40